www.prajapaksham.in
ప్రజాపక్షం
ప్రతి అక్షరం ప్రజల కోసం
స్తంభాద్రి భద్రాద్రి
శుక్రవారం | 06 | మార్చి | 2026
పేజీలు : 8

రేషన్ డీలర్‌పై కేసు నమోదు

ఒకేసారి మూడు నెలల
రేషన్ బియ్యం..!

- ఏర్పాట్లు చేస్తున్న అధికారులు
- గోదాముల సమస్య తీవ్రం
- నల్లబజార్‌కు యమ గిరాకీ
- విజిలెన్స్ నజర్

ప్రజాపక్షం/కొత్తగూడెం : వేసవి కాలాన్ని దృష్టిలో పెట్టుకుని ఏప్రిల్, మే, జూన్ నెలలకు గానూ ఒకే సారి రేషన్ సన్నబియ్యాన్ని సరఫరా చేసేందుకు సన్నాహాలు జరుగుతున్నాయి. ఇదే జరిగితే ఒక్కొక్క మనిషికి 18 కిలోల బియ్యం చొప్పున అందనున్నాయి. ఇందుకు సంబంధించి కేంద్ర ప్రభుత్వ అదేశాల మేరకు రాష్ట్ర పౌరసరఫరాల శాఖ సూచనలతో ఆయా జిల్లాల యంత్రాంగం సమాయత్తమవుతోంది. జిల్లా వ్యాప్తంగా 324917 రేషన్ కార్డులు ఉండగా 958369 మంది లబ్ధిదారులకు ప్రతీ నెల

మిగతా 2లో..

నేటి నుంచి ప్రత్యేక పారిశుధ్య డ్రైవ్

-మార్చి 12న సర్పంచ్, కౌన్సిలర్లకు వర్క్‌షాప్
-99 రోజుల కార్యాచరణపై అధికారులతో కలెక్టర్ సమీక్ష

ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ : ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా మార్చి ఆరు నుంచి 15 వరకు ప్రత్యేక పారిశుధ్య డ్రైవ్ చేపట్టాలని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి తెలిపారు. ప్రజాపాలన ప్రగతి పాలన 99 రోజుల కార్యాచరణ అమలుపై గురువారం జిల్లా అధికారులతో కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మార్చి ఆరు నుంచి జూన్ 12 వరకు ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల ప్రత్యేక కార్యాచరణ అమలు చేస్తుందన్నారు. మార్చి ఆరున ఉదయం 10 గంటలకు జిల్లా ఇంచార్జి మంత్రి, మంత్రుల ఆధ్వర్యంలో సన్నాహాక సమావేశం ఉంటుందని తెలిపారు. మార్చి ఆరు నుంచి మార్చి 15 వరకు పారిశుధ్య నిర్వహణ, ఫైల్ క్లియరెన్స్ అంశాలపై ప్రాధాన్యతతో కార్యక్రమాలను నిర్వహించాలన్నారు. గ్రామాలు,

మిగతా 2లో..

పెట్టుబడి బారెడు..
ఆడిట్‌లో మూరెడు..!

- ఎన్నికల లెక్కలలో చిత్రవిచిత్రంగా అభ్యర్థులు పెట్టిన ఖర్చులు
- ఓ వార్డులో రూ.5వేలు పెట్టి ఓటు కొనుక్కున్న కౌన్సిలర్
- తాయిలాలతో పక్కకు పోయిన అభివృద్ధి మాట
-ప్రజాస్వామ్యానికి సవాలుగా మారుతున్న ఓటు వినియోగం

ప్రజాపక్షం/ఖమ్మంరూరల్ : ప్రజలకు మౌలిక వసతుల కల్పన, పట్టణ అభివృద్ధి చేపట్టాల్సిన గురుతర బాధ్యత పురాపాలకు సంఘాల పాలకవర్గాలపై ఉంటుంది. అలాగే మన్యలను తీర్చే పాలకవర్గాలను ఎన్నుకునే బాధ్యత ప్రజలపై ఉంటుంది. కానీ జరిగిన ఏదులాపురం మున్సిపాలిటీ తొలి ఎన్నిక ఎంత కాస్ట్లీనో ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. అభివృద్ధి, హామీల మాటల కంటే తాయిలాలకే ఎక్కువ

మిగతా 2లో..

ప్రభుత్వ వైద్యం పట్ల
నమ్మకం కలిగించాలి

-అర్ధరాత్రి వెళ్లిన వైద్యులు ఉంటారన్న నమ్మకం కల్పించాలి
-వంద పడకల ఆసుపత్రి నిర్మాణానికి మంత్రి పొంగులేటి శంకుస్థాపన
-కళ్యాణ లక్ష్మి , షాదీముబారక్ చెక్కుల పంపిణీ

ప్రజాపక్షం/తిరుమలాయపాలెం : ప్రభుత్వ ఆసుపత్రుల్లో అందిస్తున్న వైద్యం పట్ల ప్రజల్లో నమ్మకం కలిగించాలని రాష్ట్ర రెవెన్యూ, సమాచార, గృహ నిర్మాణ శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. గురువారం మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తిరుమలాయపాలెంలో పర్యటించి అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస రెడ్డి తో కలిసి రూ. 26 కోట్లతో

మిగతా 2లో..

ఒకేసారి మూడు నెలల రేషన్ బియ్యం..!

(మొదటిపేజీ తరువాయి)

61121.87 మెట్రిక్ టన్నుల బియ్యం పంపిణీ చేస్తుంటారు. వచ్చే నెల నుండి మూడు నెలలకు చెందిన 183365.61 మెట్రిక్ టన్నుల సన్న బియ్యాన్ని ఒకే సారి లబ్దిదారులకు అందివ్వనున్నారు. కాగా రేషన్ బియ్యాన్ని ఇంత పెద్ద మొత్తంలో స్టాక్ పెట్టేందుకు సరిపడా గోదాములు లేకపోవడంతో అధికారులు తలలు పట్టుకున్నారు.

నల్లబజార్‌కు యమ గిరాకీ :

జిల్లాలో రేషన్ బియ్యం దంగా కొనసాగుతూనే ఉంది. జిల్లా వ్యాప్తంగా 15 నుండి 20 శాతం బోగస్ రేషన్ కార్డులే ఉన్నట్లు అనుమానాలున్నాయి. ఈ నివేదిక ప్రభుత్వం వద్ద కూడా ఉన్నట్లు తెలుస్తోంది. కాగా చాలా మంది లబ్దిదారులు ప్రభుత్వం సరఫరా చేసే ఉచిత సన్న బియ్యం తినేందుకు మక్కువ చూపడం లేదు. ఆ బియ్యాన్ని రేషన్ షాపు వద్దే కిలో రూ.12 చొప్పున విక్రయిస్తున్నారు. ఈ రకం దందా ముందుగా మొదలయ్యేది రేషన్ షాపుల నుండే. ఆ రేషన్ షాపుల డీలర్లు కిలో రూ.15 చొప్పున బ్లాక్ మార్కెట్‌కు తరలిస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా కిలో సన్నబియ్యానికి డీలర్ మారుబేరంలో రూ.3 రూపాయలు చేజిక్కుంచుకుంటున్నాడు. ఈ లెక్క ప్రకారం చూస్తే నెలకు ల క్షలాది రూపాయల దందా సాగుతున్నట్లు తెలుస్తోంది. గడిచిన వానా కాలంలో ప్రభుత్వం ఒకే సారి మూడు నెలలకు సరిపడా రేషన్ బియ్యాన్ని ఇచ్చినప్పుడు పెద్ద ఎత్తున బ్లాక్ మార్కెట్‌కు బియ్యం తరలిపోయినట్లు విజిలెన్స్ అధికారులు గుర్తించారు. గత కొంత కాలంగా విజిలెన్స్ దాడుల్లో సుమారు 1500 క్వింటాళ్ల బియ్యం పట్టుకున్నట్లు తెలుస్తోంది.

ఇలా సేకరించిన బియ్యాన్ని స్వరాష్ట్రంలో కాకుండా పొరుగు రాష్ట్రాలకు తరలించి నౌకల ద్వారా ఇతర దేశాలకు భారీ మొత్తంలో ఎగుమతి చేసేందుకు సన్నాహాలు జరుగుతున్నట్లు తెలుస్తోంది. గతంలో తెలంగాణకు చెందిన పిడిఎస్ బియ్యం పలుమార్లు ఆంధ్రాలోని కాకినాడ, విశాఖపట్నం వంటి వాడరేవు ప్రాంతాల్లో పట్టుబడిన దాఖలాలు లేకపోలేదు. ఇక్కడి రూ.15 వెచ్చించి కొనుగోలు చేసే దళారులు ఇతర ప్రాంతాలకు కిలో రూ.60 నుండి 70 రూపాయల వరకు సొమ్ము చేసుకుంటున్నట్లు తెలుస్తోంది.

ప్రజాప్రయోజనార్థం ప్రభుత్వం మూడు నెలల రేషన్ బియ్యాన్ని ఒకేసారి ఇవ్వడం బాగున్నప్పటికీ ఆ మాటున్న జరుగుతున్న రేషన్ బియ్యం దందాపై నిఘా పెట్టాలని పలువురు అభిప్రాయ పడుతున్నారు. రేషన్ షాపు డీలర్లే ప్రధాన నింధితులుగా బ్లాక్ మార్కెట్‌ను ప్రోత్సహిస్తున్నారనే పుకార్లు షికార్లు చేస్తున్న నేపథ్యంలో ఆ దిశగా విజిలెన్స్ అధికారులు దృష్టి సారిస్తే దందాను నివారించేందుకు వీలుంటుందని పలువురు అంటున్నారు.

పెట్టుబడి బారెడు.. ఆడిట్‌లో మూరెడు..!

(మొదటిపేజీ తరువాయి)

ప్రాధాన్యతను ఇచ్చారు. తమపై పోటీ చేసిన అభ్యర్థికంటే రూపాయి... కాదుకాదు ఓ ఐదువందలో,వెయ్యే ఎక్కువ ఇవ్వడమే లక్ష్యంగా లక్షలు కుమ్మరించారు. ఈ సందర్భంగా ఓ వార్డులో ఓ కౌన్సిలర్ రూ.5వేలు వెచ్చించి ఓటును కొనుక్కున్నాడు. ఇప్పుడు తాజాగా మున్సిపాలిటీలో జరుగుతున్న ఎన్నికల ఆడిట్లో చిత్ర విచిత్రాలు చోటుచేసుకుంటున్నాయి. అభ్యర్థులు చేసిన ఖర్చులను అధికారికంగా చూపిస్తున్న లెక్కల సాక్షిగా నవ్విపోదురుగనుక నాకేటి సిగ్గు అన్న చందంగా ఉంది.

కోట్లు మింగిని ఓట్లు..

ఎన్నికలలో అభివృద్ధి, హామీలు, ప్రణాళికల కంటే తాయిలాలకే ప్రాధాన్యం లభించిందనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఓవార్డులో ఏకంగా కౌన్సిలర్ అభ్యర్థి ఓటుకు రూ.5వేలు వెచ్చించి కొనుగోలు చేసుకున్నాడు. అలాగే కొన్ని వార్డులలో రూ.4,3వేలు వెచ్చించి ఓట్లు కొనుక్కొని గెలుపొందారు. ఇక రోజు వారి మందు, విందు గురించి ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. ఓ అభ్యర్థి బ్లెండర్‌స్పెడ్ క్వార్టర్, బిర్యానీ పొట్లాన్ని ఓటర్లకు ఇవ్వడం విశేషం. ఈ విధంగానే చాలమంది కౌన్సిలర్ అభ్యర్థులు తాయిలాలతో విజయ రహస్యంగా మలుచుకున్నారు. తాగినోళ్లకి తాగినంత అన్న చందంగా ఫోన్‌పేలు, బెల్ట్‌షాపులు, హోటల్లు, దాబాల్లో బిల్లులు కట్టి బుట్టలోకి దింపుకున్నారు. ఈ నేపథ్యంలో ప్రజా స్వామ్య వ్యవస్థ కూని అయ్యి పవిత్రతను దెబ్బతీసింది.

అప్పుల్లో ఓడిపోయిన అభ్యర్థులు..

గెలుపే లక్ష్యంగా పురా బరిలోకి దిగిన ఓడిపోయిన అభ్యర్థులు అప్పులు పాలయ్యారు. ఇందులో కొందరు సంపాదించుకున్న సంపాదనను పోగొట్టుకోగా.. మరి కొంతమంది అప్పులను మూటగట్టుకున్నారు. అంతో ఇంతో ఆస్తులు కలిగిన వారు వాటిని కుదవబెట్టి డబ్బులు తెచ్చి, వెచ్చించిన వారి పరిస్థితి బాగానే ఉంది. కానీ రూపాయి, రూపాయి పోగేసి కూడబెట్టుకున్న సంపద ఓట్ల రూపంలో ఆవిరై కన్నీటి పర్యంతం అయ్యారు. అయితే అప్పులు తెచ్చి బరిలో దిగిన అభ్యర్థులకు ఓటమి కొంత కలిసి వచ్చినట్లుగా తెలిసింది. అప్పుడే అప్పులు ఇచ్చిన వారు డబ్బులు తిరిగి ఇవ్వమని అడగరు కనుక కాస్త ఉపశమనాన్ని పొందుతున్నారు.

ప్రజా స్వామ్యానికి సవాలు...

ఎన్నికలు ప్రజస్వామ్యానికి పునాది. కానీ డబ్బు ప్రభావం పెరిగితే ప్రజాస్వామ్య విలువలు దెబ్బతింటాయి. ఓటు హక్కు పవిత్రమైనది. అది అభివృద్ధి, నిబద్ధత, నైతికతల ఆధారంగా వినియోగించబడాలి గాని, తాత్కలిక లాభాల కోసం విక్రయించబడకూడదు. లేదంటే ఎన్నికల తర్వాత ప్రజల సమస్యలు అలాగే మిగిలిపోయే ప్రమాదం ఉంది. వ్యాపార సాదనంలా మారిన ఎన్నికలతో రాజ్యాంగ స్ఫూర్తి నోట్ల కట్టలతో కనుమరగవుతోంది. వేలం పాటను సైతం తలదన్నేలా సాగుతున్న అడ్డగోలు వ్యవహారాలు ఆందోళన కలిగిస్తున్నాయి. ఏది ఏమైనప్పటికీ ప్రజలు చైతన్యవంతులై తమకు కల్పించిన రాజ్యాంగ హక్కును, అమ్ముకోకుండా ఉండాలనే అంశాన్ని నొక్కి చెబుతోంది.

హత్య కేసులో ఐదుగురు నిందితుల అరెస్ట్

ప్రజాపక్షం/కరకగూడెం: కరకగూడెం మండలం అశ్వాపురం పాడు గ్రామంలో గత నెల 28వ తేదీ అర్ధ రాత్రి జరిగిన హత్య నేరస్థులను గురువారం పట్టుకొని వారిని రిమాండ్ కి తరలించారు. గురువారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వివరాలు వెల్లడించారు. వజ్జ భీమరాజు, మడివి మంగయ్య మడివి నందయ్య, వంకా బాలాజీ, మడకం లక్ష్మ య్య అనే వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. మొదటి ముగ్గురికి, హత్యకు గురి అయిన కొవ్వాసి వెంకటేశ్వర్లు కి మధ్య గత కొంత కాలంగా ఊరిలో గొడవలు జరుగుతున్నాయి. భీమరాజు కొన్ని రోజులు క్రితం ఫారెస్టు వారితో ఘర్షణ కాగా అ కేసులో అతను అతని భార్య ఇద్దరు భద్రాచలం జైలుకు వెళ్లారు. అప్పుడు చనిపోయిన వ్యక్తి బీమరాజు కి మరియు అతని భార్య కు బెయిలు పెట్టకుండా అడ్డుకొని భీమరాజు భార్యకి మూడవ వ్యక్తి బెయిలు పెట్టినంధుకు అతని ఊరి నుండి వెళ్ళ గొడతా అని బెదిరించటం అలాగే రెండవ వ్యక్తి కుటుంబ విషయములో తలదూర్చి అతనని అతని భార్యని విడగొట్టి అంతే కాకుండా మరియొక భార్యను కూడా ఇతని నుండి విడగొట్టి పంపాలని చనిపోయిన వ్యక్తి చూస్తున్నాడు అని బావించి ఈ ముగ్గురు వ్యక్తులును చనిపోయిన వ్యక్తి ఏదో రకముగా ఇబ్బంధి పెడుతున్నాడు అని అతని అడ్డు తొలగించుకుందామని మొదటి వ్యక్తి అయిన బీమరాజు జైలుకి వెళ్ళినప్పుడు అతనికి జైలు లో పరిచయం అయిన బాలాజీ కి వీరి ముగ్గురు కొంత డబ్బు పోగు చేసి అతనికి 50 వేల రూపాయలు ఇస్తాము వెంకటేశ్వర్లు ను చంపటానికి అతని సహాయం కావాలని

చెప్పగా అతను ఒప్పుకోని అతను అతని స్నేహితుడు అయిన ఐదవ వ్యక్తి మడకం లక్ష్మ య్య ను తీసుకొని గత నెల 27న అశ్వాపురం పాడు కి వచ్చి అందరూ కలిసి పథకం ప్రకారం పడుకొని ఉన్న వెంకటేశ్వర్లు ను గత నెల 28వ తేది అర్ధ రాత్రి గొడ్డలితో నరికి చంపారు. ఆ తర్వాత అక్కడి నుండి వెళ్ళిపోగా ఈ రోజున పై ఐదుగురు వ్యక్తులను ఏడూళ్ళ బయ్యారం సీఐ వి. వెంకటేశ్వరరావు అరెస్టు చేసి అ ఐదుగురు వద్ద నుండి అతని చంపటానికి వాడిన గొడ్డలిని అతని చంపినప్పుడు రక్తపు మరకలు అంటిన బట్టలను, బాలాజీ లక్ష్మ య్య అశ్వాపురం పాడు రావటానికి ఉపయోగించిన మోటార్ సైకిల్ ను స్వాధీన పరుచుకొని రిమాండ్ కి తరలించారు. ఈ కార్యక్రమములో స్థానిక ఎస్ఐ పివిఎన్ రావు, ఏడూళ్ళ బయ్యారం ఎస్సై పి. సురేష్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

గోనెల విజయలక్ష్మి మృతిపట్ల సిపిఐ సంతాపం

ప్రజాపక్షం/ ఖమ్మం : జిల్లా పరిషత్ మాజీ ఛైర్మన్ గోనెల విజయలక్ష్మి మృతిపట్ల సిపిఐ ఖమ్మం జిల్లా సమితి తీవ్ర సంతాపాన్ని వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలియజేసింది. సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్ గురువారం ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేశారు. రాజకీయ కుటుంబం నుంచి వచ్చిన ఆమె ఎన్నో ఒడుదొడుకులను ఎదుర్కొని ప్రజల పక్షాన నిలబడ్డారని సురేష్ తెలిపారు. జిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్‌గా ఆమె అందించిన సేవలు చిరస్మరణీయమన్నారు. సంక్లిష్ట పరిస్థితుల్లో ఛైర్మన్ బాధ్యతలు స్వీకరించిన ఆమె ఎంతో నిబద్ధతతో అన్ని పక్షాలను కలుపుకుని ఉమ్మడి ఖమ్మం జిల్లా అభివృద్ధి కోసం ఎంతో కృషి చేశారన్నారు. వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నట్లు సురేష్ తెలిపారు.

రేషన్ డీలర్‌పై కేసు నమోదు

ప్రజాపక్షం/ చింతకాని : రేషన్ దుకాణంలో ఉండాల్సిన బియ్యం నిల్వలో తేడా ఉండడంతో సదరు రేషన్ డీలర్‌పై పౌర సరఫరాల అధికారులు కేసు నమోదు చేశారు. గురువారం జిల్లా పౌర సరఫరాల శాఖాధికారి చందన్‌కుమార్ మండల పరిధిలోని నాగిలిగొండలో రేషన్ దుకాణాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రేషన్ దుకాణంలో ఉండాల్సిన బియ్యం నిల్వలలో భారీ తేడా ఉన్నట్లు గుర్తించారు. రికార్డుల ప్రకారం దుకాణంలో 112.61 క్వింటాళ్ల ధాన్యం ఉండాల్సి ఉండగా కేవలం 52.50 క్వింటాళ్లు మాత్రమే ఉన్నట్లు గుర్తించారు. సుమారు 60.11 క్వింటాళ్ల ధాన్యం తక్కువగాఉన్నట్లు తనిఖీలో తేలింది. దీనితో సంబంధిత రేషన్ డీలర్‌పై 6ఎ కేసుతో పాటు క్రిమినల్ కేసు నమోదు చేసినట్లు పౌర సరఫరాల అధికారి తెలిపారు. ఈ సందర్భంగా డిసిఎస్‌వో చందన్‌కుమార్ మాట్లాడుతూ జిల్లాలోని అన్ని రేషన్ దుకాణాల డీలర్లు నిబంధల మేరకు రేషన్ బియ్యం పంపిణీ చేయాలని తెలిపారు. నిల్వలో తేడా ఉన్నట్లయితే కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా అర్హులైన లబ్దిదారులకు అందాల్సిన నిత్యావసర సరుకులలో నిర్లక్ష్యం లేదా అవినీతి వంటివి జరిగితే కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు. నిబంధనలు ఉల్లంఘించే డీలర్లకు ఎటువంటి వెసులుబాటు ఇవ్వడం జరగదని రేషన్ షాపులపై నిరంతరం తనిఖీలు నిర్వహిస్తామని ఆయన తెలిపారు. కార్యక్రమంలో సివిల్ సప్లయ్ డిటిలు విజయ్‌బాబు, ఎం. వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ప్రభుత్వ వైద్యం పట్ల నమ్మకం కలిగించాలి

(మొదటిపేజీ తరువాయి)

నిర్మించనున్న 100 పడకల ఆసుపత్రి నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. 39 మంది కళ్యాణలక్ష్మి, షాదీముబారక్ లబ్దిదారులకు చెక్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ మండల కేంద్రంలో రూ. 26 కోట్లతో 100 పడకల ఆసుపత్రిని నిర్మిస్తున్నామన్నారు. గిరిజనులు అధికంగా ఉండే ఈ మండలంలో ఎటువంటి అత్యవసర వైద్యం కోసమైనా ఖమ్మం వెళ్లాల్సిన పరిస్థితి ఉండేదన్నారు. ప్రజా ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఇక్కడ ప్రసవాలకు అవసరమైన వసతులు కల్పించి స్టాఫ్‌ను నియమాకం చేశామన్నారు. 100 పడకల ఆసుపత్రి నిర్మాణం పూర్తయితే జిల్లా ఆసుపత్రిని మరపించేవిధంగా అన్ని వసతులు కల్పించడం జరుగుతుందన్నారు. విద్య,వైద్య రంగాలకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యతనిస్తుందని తెలిపారు. అర్ధరాత్రి వెళ్లినా ఆసుపత్రిలో వైద్యులు అందుబాటులో ఉంటారని ప్రజలకు నమ్మకం కల్పించాలన్నారు. వైద్యులు స్థానికంగా అందుబాటులో ఉండాలని తెలిపారు. ఇటీవల ఇల్లందు, చర్ల, పినపాకలో పర్యటించినప్పుడు ప్రభుత్వ ఆసుపత్రులను పరిశీలిస్తే ఆశ్చర్యం కలిగిందని అక్కడ సిబ్బంది మంచి పనితీరుతో అద్భుత ఫలితాలు వస్తున్నాయన్నారు. ప్రజలకు మెరుగైన వైద్య సేవలను అందించే వైద్య సిబ్బందికి ప్రత్యేక బహుమతులు పాలేరు నియోజక వర్గంలో అందిస్తామని మంత్రి తెలిపారు. పాలేరు నియోజక వర్గ పరిధిలో రెండు 100 పడకల ఆసుపత్రులను నిర్మించడంతో వైద్యానికి ప్రభుత్వం ఇస్తున్న ప్రాధాన్యత తెలుస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో డిఎంఅండ్‌హెచ్‌వో డాక్టర్ రామారావు, డిసిహెచ్‌ఎస్ డాక్టర్ రాజశేఖర్, హౌజింగ్ పిడి శ్రీనివాస్, డిప్యూటీ డిఎంఅండ్‌హెచ్‌వో డాక్టర్ చందు నాయక్, ఆసుపత్రి సూపరింటెండెంట్, వైద్యశాఖ సిబ్బంది, సంబంధిత అధికారులు, ఎంపిడివో సిలాబ్ సాహెబ్, తహసీల్దార్ విల్సన్, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి ప్రత్యేక పారిశుధ్య డ్రైవ్

(మొదటిపేజీ తరువాయి)

పట్టణాల్లో మాత్రమే కాకుండా ప్రతి ప్రభుత్వ కార్యాలయంలో కూడా పారిశుధ్య డ్రైవ్ చేపట్టాలని, పాత ఫర్నీచర్‌ను తొలగించాలని దీనిపై ఆకస్మిక తనిఖీలు నిర్వహిస్తామన్నారు. ప్రభుత్వ కార్యాలయాల్లో పెండింగ్‌లో ఉన్న ఫైల్స్‌ను 10 రోజుల్లో క్లియర్ చేయాలన్నారు. ఎక్కడ రోడ్డుపై చెత్త లేకుండా జాగ్రత్తలు పాటించాలన్నారు. వార్డు సభ్యులు, సర్పంచ్, మున్సిపల్ ఛైర్మన్లు, మేయర్లను పూర్తి స్థాయిలో భాగస్వామ్యం చేయాలన్నారు. పబ్లిక్ ప్రదేశాల్లో పారిశుధ్యం పట్ల అత్యంత ప్రాధాన్యత కల్పించి చర్యలు తీసుకోవాలన్నారు. మార్చి 12న జిల్లా స్థాయిలో సర్పంచ్, పట్టణాలలోని కౌన్సిలర్లకు వర్క్‌షాప్ నిర్వహిస్తున్నామన్నారు. దీనికి ప్రతి ఒక్కరూ హాజరయ్యేవిధంగా చర్యలు తీసుకోవాలన్నారు. 99 రోజుల ప్రత్యేక కార్యాచరణ ముగిసే నాటికి ఖమ్మం జిల్లాలో 10వేల ఇందిరమ్మ ఇండ్లు గృహప్రవేశానికి సిద్ధం చేసేలా అసిస్టెంట్ ఇంజనీర్లు పనిచేయాలన్నారు. జిల్లా ఇంచార్జి మంత్రి ఆధ్వర్యంలో జరిగే సన్నాహాక కార్యక్రమానికి అవసరమైన అన్ని ఏర్పాట్లు కట్టుదిట్టంగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ఈ సమావేశంలో ఎస్‌డిసి ఎం. రాజేశ్వరి, జిల్లా ముఖ్య ప్రణాళికాధికారి శ్రీనివాస్, జిల్లా పంచాయతీ అధికారి రాంబాబు, జిల్లా విద్యాశాఖాధికారిణి చైతన్యజైని, డిఎంఅండ్‌హెచ్‌వో డాక్టర్ రామారావు, వివిధ శాఖల జిల్లా అధికారులు, మున్సిపల్ కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వ ఫాసిస్టు విధానాలను ప్రతిఘటించండి

-సిపిఐ(ఎంఎల్) ఎన్డి కేంద్ర కమిటీ సభ్యురాలు టాన్య పిలుపు

ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ : కేంద్ర ప్రభుత్వ ఫాసిస్టు విధానాలను ప్రతిఘటించాలని సిపిఐ(ఎంఎల్) న్యూ డెమోక్రసీ కేంద్ర కమిటీ సభ్యురాలు టాన్య పిలుపునిచ్చారు. గురువారం ఖమ్మం నగరంలోని జూబ్లీక్లబ్‌లో భారత కమ్యూనిస్టు పార్టీ మహాసభకు నూరు వసంతాల సందర్భంగా సిపిఐ(ఎంఎల్)న్యూడెమోక్రసీ కేంద్ర కమిటీ ఆధ్వర్యంలో జాతీయ సదస్సు కా॥ చంద్ర పుల్లారెడ్డి హాల్‌లో కేంద్ర కమిటీ సభ్యులు బి. భాస్కర్ అధ్యక్షతన జరిగింది. సిపిఐ(ఎంఎల్)న్యూడెమోక్రసీ జెండాను కేంద్ర కమిటీ సభ్యురాలు పి. టాన్య ఆవిష్కరించారు. అమరవీరులను స్మరిస్తూ అరుణోదయ సాంస్కృతిక కళాకారులు పాటలు పాడారు. ఈ సందర్భంగా కేంద్ర కమిటీ సభ్యురాలు టాన్య మాట్లాడుతూ దేశంలోని మేధావులు, ఉద్యమకారులు, ప్రగతిశీల శక్తులు, కమ్యూనిస్టు విప్లవకారులు అందరూ ఏకమయ్యారన్నారు. 1917 అక్టోబర్ విప్లవం రష్యాలో విజయవంతమైన తర్వాత మార్క్సిస్టు మహోపాధ్యాయుడు కా॥ లెనిన్ నాయకత్వాన ప్రపంచలోని వలసవాద దేశాల్లో కమ్యూనిస్టు పార్టీలు పురుడుపోసుకున్నాయన్నారు. అదే తరుణంలో భారతదేశంలోని విప్లవకారులు, గదర్ పార్టీ నాయకులందరూ రష్యాకు వెళ్లి కామ్రేడ్లను సంప్రదించి భారత కమ్యూనిస్టు పార్టీని స్థాపించడం జరిగిందన్నారు. 1926లో తాస్కంట్‌లో మొదటి మహాసభ జరిగి నేటికి నూరేళ్లు పూర్తయిందన్నారు. సిపిఐ పార్లమెంటరీ పంథాను తీసుకోవడంతో కమ్యూనిస్టు విప్లవకారులు సిపిఐ నుండి బయటకు వచ్చి మార్క్సిస్టుగా సిపి(ఐ)ఎం గా పార్టీని ప్రారంభించారన్నారు. సిపిఎం పార్టీ కూడా ఎన్నికల పంథాను తీసుకోవడంతో సిపిఎం నుండి ఆంధ్ర విప్లవకారులు తెగతెంపులు చేసుకుని ఆంధ్రప్రదేశ్ విప్లవకారుల సమన్వయ కమిటీ పేరుతో సిపిఐ(ఎంఎల్) పార్టీని కొనసాగించారన్నారు. చంద్ర పుల్లారెడ్డి, దేవులపల్లి వెంకటేశ్వరరావు, తరమిల నాగిరెడ్డి, కొల్ల వెంకయ్య తదితరులు భారత విప్లవ పంథాను కొత్త పుంతలు తొక్కించరన్నారు. దేశంలో విప్లవకారులంతా ప్రతిఘటన పోరాటాన్ని సాయుధ పోరాట పంథాను ముందుకు తీసుకు వచ్చారన్నారు. కేంద్రంలోని బిజెపి మోడీ ప్రభుత్వం ఫాసిస్టు పాలన కొనసాగిస్తుందన్నారు. ప్రజా రైతు కార్మిక వ్యతిరేక విధానాలను అవలంభిస్తుందన్నారు. ప్రశ్నించే గొంతుకలను, ఉద్యమించే ప్రజలను నిర్బంధిస్తున్నారన్నారు. తక్షణమే మోడీ ప్రభుత్వం అవలంభిస్తున్న విధానాలను విడనాడాలన్నారు. లేనియేడల దేశంలో పెద్ద ఎత్తున పోరాటాలు ముందుకు వస్తాయని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ(ఎంఎల్) ఎన్డి కేంద్ర కమిటీ నాయకులు అశోక్ గాయల్, ఆరెల్లి కృష్ణ, కె. విశ్వనాథ్, రైతు కూలీ సంఘం ఏపి రాష్ట్ర అధ్యక్షులు ప్రకాష్, భద్రాద్రి కొత్తగూడెం ఖమ్మం సంయుక్త జిల్లా కమిటీ కార్యదర్శి కందగట్ల సురేందర్, నాయకులు రామ్మూర్తి, సాంబ, సాయిలు, ఉపేందర్, యలమద్ది కళాధర్, కె. నాగేశ్వరరావు, బట్టు, రవిరాజ్, చిట్టిబాబు, నున్నా అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

ఇరాన్‌పై దాడులకు నిరసనగా దిష్టిబొమ్మ దహనం

ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ : ఇరాన్‌పై అమెరికా, ఇజ్రాయిల్ చేస్తున్న దాడులతో మనదేశానికి తీవ్రమైన ఇంధన సంక్షోభం తప్పదని సిపిఐ(ఎంఎల్)మాస్‌లైన్ ఖమ్మం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు జి. రామయ్య తెలిపారు. పార్టీ కేంద్ర కమిటీ ఇచ్చిన పిలుపులో భాగంగా గురువారం ఖమ్మం నగరంలోని బైపాస్ రోడ్డులో ప్రదర్శన నిర్వహించారు. అమెరికా యుద్ధోన్మాది ట్రంప్ దిష్టిబొమ్మను దగ్ధం చేశారు. ఈ సందర్భంగా రామయ్య మాట్లాడుతూ గల్ఫ్ దేశాల్లో ఆయిల్‌పై ఆధిపత్యం కోసం అమెరికా చేస్తున్న నర మేధాన్ని ప్రజలు, ప్రజాస్వామ్యవాదులు ఖండించాలన్నారు. యుద్ధం ఇలాగే కొనసాగితే భారతదేశంలో చమురు సంక్షోభం ఏర్పడుతుందన్నారు. యుద్ధాలు చేసిన ఏ దేశం బాగుపడలేదని యుద్ధం వల్ల విధ్వంసం తప్ప మరొకటి ఉండదన్నారు. ఇప్పటికైనా అమెరికా, ఇజ్రాయిల్ లు ఇరాక్‌పై చేస్తున్న యుద్ధాన్ని వెంటనే ఆపాలన్నారు. ఈ యుద్ధాన్ని భారతదేశం కూడా ఖండించాలని ఆయన తెలిపారు.ఈ కార్యక్రమంలో డివిజన్ కార్యదర్శి ఝాన్సీ, నగర కార్యదర్శి శోభ, జిల్లా కమిటీ సభ్యులు సిహెచ్ శిరోమణి, కె. శ్రీనివాస్, జే. లెనిన్, చందు, బజార్, నన్నే శ్రీను, తిరపయ్య, దాసు, సైదులు, రామరాజు, రవి తదితరులు పాల్గొన్నారు.

మైసయ్య కుమారునికి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలి

-విశ్రాంత పోలీస్ అధికారుల సంఘం డిమాండ్

ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ : రిటైర్‌మెంట్ బకాయిలు సకాలంలో అందక ఆర్థిక ఇబ్బందులు, అనారోగ్యంతో మృతిచెందిన విశ్రాంత ఏఆర్ఎస్ఐ కుక్కల మైసయ్య కుమారునికి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని విశ్రాంత పోలీస్ అధికారుల సంఘం డిమాండ్ చేసింది. రెండు వారాల క్రితం మృతిచెందిన మైసయ్య భార్య భాగ్యమ్మ బుధవారం హైదరాబాద్ నిమ్స్‌లో చికిత్స పొందుతూ మరణించింది. ఆమె భౌతికాయాన్ని ఖమ్మం నగరానికి తీసుకు వచ్చిన విషయం తెలుసుకున్న విశ్రాంత పోలీస్ అధికారుల సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఆర్. రాధాకృష్ణమూర్తి, రుద్ర వెంకటనారాయణ గురువారం భాగ్యమ్మ మృతదేహాన్ని సందర్శించి పుష్పగుచ్చాలు ఉంచి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రిటైర్‌మెంట్ బకాయిలు మైసయ్య మరణానంతరం ప్రభుత్వం విడుదల చేసిందని సకాలంలో ఆ డబ్బు అందక ఆర్థికంగా, అనారోగ్య సమస్యలతో దంపతులు ఇద్దరు మృతిచెందారన్నారు. మైసయ్య, భాగ్యమ్మ మృతితో వారి ముగ్గురు కుమారులు అనాథలయ్యారన్నారు. వారి పెద్ద కుమారుడు ప్రకాష్ దీర్ఘకాలిక వ్యాధితో బాధపడుతున్నాడని నెలకు రూ. 20వేలు ఖర్చు అవుతుందని వారు తెలిపారు. ఆ కుటుంబాన్ని ఆదుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. మైసయ్య మృతికి పరిహారంగా వారి కుమారునికి ప్రభుత్వ ఉద్యోగం లేదా పెన్షన్ ఇప్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో విశ్రాంత పోలీస్ అధికారులు బోడేపూడి రాజారావు, ప్రసాదరావు, దామోదర్‌రావు, కిషోర్‌బాబు, ప్రభాకర్, కార్యవర్గ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

గంజాయి కేసులో నిందితులకు 20 ఏళ్లు జైలుశిక్ష

ప్రజాపక్షం/ రఘునాథపాలెం : గంజాయి కేసులో ముగ్గురు నిందితులకు ఒక్కొక్కరికి 20 ఏళ్లు జైలు శిక్ష, రెండు లక్షల జరిమానా విధిస్తూ మొదటి అదనపు జిల్లా, సెషన్స్ కోర్టు న్యాయమూర్తి కె. ఉమాదేవి తీర్పునిచ్చారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం 2021 ఏప్రిల్ ఏడున రఘునాథపాలెం పోలీసుల ఆధ్వర్యంలో వి. వెంకటాయపాలెం గ్రామ శివారులో వాహనాలు తనిఖీ చేస్తుండగా అనుమానాస్పదంగా కనిపించిన కారును తనిఖీ చేయగా రూ. 30 లక్షల విలువైన 194 కేజీల గంజాయిని గుర్తించారు. నిందితులను అదుపులోకి తీసుకుని విచారించగా అక్రమార్జన కోసం డొంకరాయి నుండి హైదరాబాద్‌కు గంజాయిని సరఫరా చేస్తున్నట్లు విచారణలో వెల్లడైంది. ఎ1 నిందితునిగా మహబూబాబాద్ జిల్లా అననేయులు తండా దండేగా గ్రామానికి చెందిన బోడావాల, ఎ2 నిందితునిగా బూర్గంపాడు మండలం సారపాకకు చెందిన కొండపల్లి రవితేజ, ఎ3 నిందితునిగా సారపాకకు చెందిన బొజ్జ వంశీలపై రఘునాథపాలెం పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేశారు. దర్యాప్తు అనంతరం కోర్టులో అభియోగ పత్రం దాఖలు చేశారు. నిందితులపై మోపిన అభియోగం రుజువు కావడంతో న్యాయమూర్తి పైవిధంగా తీర్పునిచ్చారు. ప్రాసిక్యూషన్‌కు సహకరించిన అప్పటి విచారణ అధికారులు ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణరెడ్డి, సబ్ ఇన్‌స్పెక్టర్ వరాల శ్రీనివాస్, అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ కె. శరత్‌కుమార్‌రెడ్డి, కోర్టు కానిస్టేబుల్ సాంబశివరావు, కోర్టు లైజనింగ్ కె. శ్రీకాంత్, హోంగార్డ్ ఆఫీసర్ ఎండి ఆయూబ్ లను పోలీస్ అధికారులు అభినందించారు.

కళ్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ

ప్రజాపక్షం/ రఘునాథపాలెం : కళ్యాణ లక్ష్మి పథకం క్రింద మంజూరైన చెక్కులను లబ్దిదారులకు పంపిణీ చేశారు. గురువారం మండల పరిధిలోని వి.వెంకటాయపాలెం గ్రామ పంచాయతీ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఐదుగురు లబ్దిదారులకు కళ్యాణలక్ష్మి పథకం క్రింద మంజూరైన చెక్కులను సర్పంచ్ కాపా ఆదినారాయణ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ ప్రభుత్వం అర్హులైన ప్రతి ఒక్కరికి ప్రభుత్వ పథకాల ద్వారా లబ్ది చేకూరుస్తుందన్నారు. పేదింట ఆడపిల్ల పెళ్లికి కళ్యాణ లక్ష్మి పథకం ద్వారా ఆర్థిక సాయం అందిస్తుందని తెలిపారు. ఈ సందర్భంగా లబ్దిదారులు మంత్రి తుమ్మల నాగేశ్వరరావుకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి భూక్యా కృష్ణ, కిలారు వెంకటరమణ, అంకప్పారావు, బొలగాని రామలింగం, బానోత్ చిన్న తదితరులు పాల్గొన్నారు.

ఉద్యమకారుల ఫోరం కన్వీనర్‌గా చిట్టిమల్లు

ప్రజాపక్షం/ఖమ్మంరూరల్ : ఏదులాపురంమున్సిపాలిటీపరిధిలోని 23వ డివిజన్‌కు చెందిన ఎదురుగట్ల చిట్టిమల్లు తెలంగాణ ఉద్యమకారుల ఫోరం పాలేరు నియోజకవర్గం కన్వీనర్గా నియమితులయ్యాడు. ఈ మేరకు తెలంగాణ ఉద్యకారుల ఫోరం రాష్ట్ర కమిటీ చైర్మన్ డాక్టర్ చీమ శ్రీనివాస్ గురువారం నియామక పత్రాన్ని అందజేశారు. బాధ్యతను స్వీకరించిన చిట్టిమల్లు మాట్లాడుతూ...తెలంగాణ సాధన కోసం పోరాడిన ప్రతి కార్యకర్తకు న్యాయం జరిగేలా కృషి చేస్తానని తెలిపారు. పాలేరునియోజకవర్గంలో ఫోరం కార్యకలాపాలను విస్తరించి, ఉద్యమకారుల గౌరవాన్ని కాపాడేందుకు కట్టుబడి ఉంటానన్నారు. తనపై నమ్మకం ఉంచి బాధ్యతను అప్పగించిన రాష్ట్ర కమిటీకి కృతజ్ఞతలు తెలిపాడు.ఈ నియామకం ఉద్యమకారుల్లో కొత్త ఉత్సాహాన్ని నింపుతుందని ఉద్యమకారులు అభిప్రాయపడుతున్నారు.

పాఠశాల అభివృద్ధికి కృషి చేస్తా..

ప్రజాపక్షం/వైరా: వైరా మున్సిపాలిటీ పరిధిలోని 1వ వార్డులో ఉన్న మండల పరిషత్ పాఠశాలను గురువారం ఆ వార్డు కౌన్సిలర్ మోర్ శ్రీకాంత్ పరిశీలించారు. ఈ సందర్భంగా పాఠశాలలో ఉన్న వంట గదిని ఆయన పరిశీలించారు. అనంతరం పాఠశాలలో ఉన్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా శ్రీకాంత్ మాట్లాడుతూ పాఠశాలలో మౌలిక వసతుల కోసం కృషి చేస్తానని, పాఠశాలలో చెట్ల ప్రక్కన కరెంటు వైర్లు ఉన్న విషయాన్ని వెంటనే విద్యుత్ అధికారులతో మాట్లాడి వాటిని పరిష్కరించాలని తెలపడం జరిగిందని అన్నారు. అదేవిధంగా శిథిలావస్థలో ఉన్న మిడ్ డే మీల్స్ గదిని చూడడం జరిగింది. త్వరలోనే దానికి ప్రత్యామ్నాయంగా ఏర్పాట్లు కృషి చేస్తారని అన్నారు. పాఠశాలలో ఏ సమస్య ఉన్న నా దృష్టికి తీసుకురండి, తక్షణమే సమస్యలు పరిష్కరించేందుకు ఎమ్మెల్యే రాందాస్‌నాయక్ సహకారంతో మీ ముందు ఉంటానని కౌన్సిలర్ శ్రీకాంత్ అన్నారు. కార్యక్రమంలో గాజుల మహేష్, వాటర్ లైన్‌మెన్ ఓర్సు వెంకట్, రాయపూడి కన్నయ్య, అనిల్, పాఠశాల సిబ్బంది, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

15వ వార్డులో దోమల నివారణకు చర్యలు

ప్రజాపక్షం/వైరా: వైరా మున్సిపాలిటీ పరిధిలోని దిద్దుపూడి 15వ వార్డులో ఆ వార్డు కౌన్సిలర్ నల్లమోతు శైలజ, సురేష్ దోమల నివారణకు ప్రత్యేక చర్యలు చేపట్టారు. గురువారం వార్డులో మున్సిపల్ సిబ్బందితో మురికి కాల్వలు, నీటి గుంతల్లో దోమల నివారణకు మందు పిచికారి చేపించారు. వీధుల్లో చెత్తాచెదారాన్ని శుభ్రం చేసి ప్రధాన వీధుల్లో మురికి కాల్వలపై మొలచిన గడ్డిపై మందు స్ప్రే చేపించారు. ఈ సందర్భంగా కౌన్సిలర్ నల్లమోతు శైలజ మాట్లాడుతూ ప్రజలు ఇంటి ముందు డ్రైనేజీల్లో నీరు నిల్వ లేకుండా చూసుకోవాలని నీరు నిల్వ ఉండడం వలన దోమల వృద్ధి చెందుతాయని అలా గుర్తించకుండా ఉండాలంటే మనం జాగ్రత్తలు పాటించాలని సూచించారు.

జేఎన్టీయూహెచ్ ఫలితాల్లో మెరిసిన ప్రియదర్శిని విద్యార్థినులు

ప్రజాపక్షం/ఖమ్మంరూరల్ : ఏదులాపురంమున్సిపాలిటీపరిధిలోని 6వ వార్డులో గల ప్రియదర్శిని మహిళా ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థినులు జవహర్‌లాల్ నెహ్రూ టెక్నలిజికల్ యూనివర్శిటీ హైదరాబాద్ విడుదల చేసిన ద్వితీయ సంవత్సర పరీక్షా ఫలితాలలో అద్భుత ప్రతిభను కబనరిచారు. సిఎస్సి విభాగానికి చెందిన తేనె మోహిత్ 9.25, కోడె అఖిల్ 8.3, ఏఐడీ విభాగానికి చెందిన ఏ త్రివేణి జె హన్సికరెడ్డి 8.45, జీ చిన్మయిరెడ్డి 8.3, సిఎస్ఎం విభాగానికి చెందిన టి. అంకిత, వై. లక్ష్మీ ప్రసన్న 8.9, కే. ప్రసన్న 8.6, ఈసీఈ విభాగానికి చెందిన పి. జోష్న 9.4, జి. పూజ 8.65 జీపీఏలను సాధించారు. ఈ సందర్భంగా అద్భుత ఫలితాలు సాధించిన విద్యార్థినులను కళాశాల చైర్మన్ కాటేపల్లి నవీన్ బాబు, ప్రిన్సిపల్ డాక్టర్ బి. గోపాల్, అకాడమిక్ డైరెక్టర్ అట్లూరి వెంకటరమణ మంగళవారం కళాశాలలో అభినందించారు. ఈ కార్యక్రమంలో కళాశాలకు చెందిన వివిధ విభాగాధిపతులు ఐ నరసింహారావు, ఎం వెంకటేశ్వరరావు, డి. రమేష్ తదితరులు పాల్గొన్నారు.

పీవోడబ్ల్యూ ఆధ్వర్యంలో సెమినార్

ప్రజాపక్షం/కారేపల్లి: కారేపల్లి మండల కేంద్రంలో మాదారం ఉమ్మడి పంచాయితీ పరిధిలోని పాత చనగలగడ్డ పాతూరు గ్రామంలో ప్రగతిశీల మహిళా సంఘం ఆధ్వర్యంలో అంతర్జాతీయ శ్రామిక మహిళా దినోత్సవం సందర్భంగా సెమినార్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పీవోడబ్ల్యూ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి శారు కవిత మాట్లాడుతూ మహిళలు సంవత్సరాల తరబడి పోరాడి సాధించుకున్న హక్కులను నిర్వీర్యం చేసే విధానాలను వ్యతిరేకించాలని పిలుపునిచ్చారు. మహిళా కార్మికుల హక్కుల పరిరక్షణ కోసం పోరాటాలను మరింత బలోపేతం చేయాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. ఈకార్యక్రమంలో పీవోడబ్ల్యూ రాష్ట్ర నాయకురాలు భాగ్యలక్ష్మీ, రాణి, నాగమణి, లక్ష్మీ, గ్రామ శాఖ కార్యదర్శి సక్కుబాయి, పాయం బోయమ్మ, సుహాసిని, మంజుల, రమణ, రజిత, వసంత లక్ష్మీ, ఆర్యం పొట్టెమ్మ, న్యూడెమోక్రసీ నాయకులు శివ నాయక్, తదితరులు పాల్గొన్నారు.

పది విద్యార్థులకు పరీక్షా సామగ్రి పంపిణీ

ప్రజాపక్షం/కారేపల్లి: జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల కోమట్లగూడెంలో నిర్వహించిన ఫేర్‌వెల్ కార్యక్రమంలో గాంధీనగరం గ్రామానికి చెందిన సింగు వెంకటేశ్వర్లు పదో తరగతి పరీక్షలు రాయబోతున్న విద్యార్థులకు శుభాకాంక్షలు తెలియజేసి పరీక్షా ప్యాడ్లు, పెన్నులు పంపిణీ చేశారు. ఈకార్యక్రమంలో సింగరేణి మండల విద్యాధికారి జయరాజు, పాఠశాల ప్రిన్సిపాల్ శారద, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నూతన వధూవరులకు ఆశీర్వాదం

ప్రజాపక్షం/కూసుమంచి: కూసుమంచి మండల కేంద్రంలోని విజయరామ ఫంక్షన్ హాల్‌లో వనగిరి సాయి రాజశేఖర్ సోదరుడు ఓంకార్ విజయ నూతన వధూవరులను తెలంగాణ రాష్ట్ర రెవెన్యూ గృహ నిర్మాణ సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి కూసుమంచి క్యాంప్ కార్యాలయం ఇంచార్జ్ భీమిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి ఆశీర్వదించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ నూతన వధూవరులకు శుభాకాంక్షలు తెలిపి, వారి దాంపత్య జీవితం సుఖసంతోషాలతో సాగాలని ఆకాంక్షించారు. ఈకార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, బంధు మిత్రులు పాల్గొన్నారు.

జగన్నాథపురంలో రోడ్డు విస్తరణకు చర్యలు

ప్రజాపక్షం/ములకలపల్లి: ములకలపల్లి మండలంలోని జగన్నాథపురం గ్రామ ప్రధాన రహదారిపై వాహనదారులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని రోడ్డు విస్తరణకు అధికారులు చర్యలు చేపట్టారు. ఆర్‌అండ్‌బీ మరియు పోలీస్ శాఖల ఆధ్వర్యంలో రహదారి నుండి 50 అడుగుల పరిధిలో ఉన్న దుకాణాలు, నివాస గృహాలను గుర్తించారు. గ్రామ పంచాయితీ ద్వారా సంబంధిత వారికి నోటీసులు జారీ చేసి తొలగింపు చర్యలు చేపడతామని అధికారులు తెలిపారు. ఈకార్యక్రమంలో సర్పంచ్ కుంజా వినోద్, సీఐ సతీష్, ఎస్ఐ మధు ప్రసాద్, ఆర్‌అండ్‌బి డీఈ విష్ణువర్ధన్, ఏఈ సురేష్ పాల్గొన్నారు.

ఈవిఎం గోదామును పరిశీలించిన కలెక్టర్

ప్రజాపక్షం/కొత్తగూడెం : ఆర్‌డీఓ కార్యాలయం ప్రాంగంలోని ఈవిఎం గోదామును జిల్లా కలెక్టర్ అంకిత్ గురువారం తనిఖీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉన్నతాధికారుల ఆదేశాల మేరుక ఈవిఎం గోదాముని ప్రతీ మూడు నెలలకోసారి తనిఖీ చేయడం జరుగుతుందనిన ఇందులో భాగంగా పరిశీలించినట్లు చెప్పారు. ఈవీఎం ప్యాట్లు, సీసీ కెమోరాల పనితీరును పరిశీలించినట్లు తెలిపారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గోదాము పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలని, అనుమతి లేనిదే ఎవ్వరినీ లోనికి రానివ్వరాదని సెక్యూరిటీ గార్డుకు తెలిపారు. అనంతరం రిజిస్ట్రర్‌లో సంతకం చేశారు. ఈ కార్యక్రమంలో తహశిల్దార్ పుల్లయ్య, ఎన్నికల సూపరింటెండెంట్ దారా ప్రసాద్, డిఎల్‌ఎం సాయికృష్ణ, నోముల రమేష్, జయశ్రీ లక్ష్మీ, రాంబాబు, సత్యానారాయణ, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

మిషన్ భగీరథ పైప్‌లైన్‌లలో సాంకేతిక సమస్యలు పరిష్కరించాలి

మున్సిపాలిటీలో తాగునీటి సమస్యను నివారించాలి
సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు అన్నవరపు కనకయ్య

ప్రజాపక్షం/మణుగూరు: వేసవి రాకముందే మంచినీటి సమస్యలు తలెత్తుతున్నాయని మిషన్ భగీరథ పైప్ లైన్ లలో ఉన్న సాంకేతిక సమస్యలను పరిష్కరించాలని మణుగూరు మున్సిపాలిటీలో తక్షణమే మంచినీటి సమస్య పరిష్కరించాలని సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు అన్నవరపు కనకయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం స్థానిక శ్రామిక భవనంలో బొల్లం రాజు అధ్యక్షతన జరిగిన సమావేశంలో పాల్గొని మాట్లాడుతూ మణుగూరు మున్సిపాలిటీ పరిధిలో తీవ్ర మంచినీటి సమస్య నెలకొన్నదని అన్నారు ప్రధానంగా శివలింగాపురం, బాపనగుంట గ్రామాలలో సరైన మంచి నీటి సౌకర్యాలు లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. నిర్మాణంలో ఉన్న వాటర్ ట్యాంకులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేసి వేసవి రాకముందే ప్రజలకు మంచినీరు అందించాలన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని 20 వార్డులలో మంచి నీటి సమస్య ఉన్నదని అన్నారు. మండలంలో మిషన్ భగీరథ పైపు లైన్ ల లో ఉన్న సాంకేతిక సమస్య కారణంగా మంచినీరు ప్రజలకు అందుబాటులో కి రావడం లేదన్నారు. కొన్ని ప్రాంతాలలో రెండు బిందుల కన్నా ఎక్కువ రావడం లేదని, కొన్ని ప్రాంతాలలో గాలి తప్ప నీరు రావడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే పైపులైన్ పునర్నిర్మాణం చేపట్టి అందరికి నిరంతర నీరందేలా చూడాలన్నారు. వలస ఆదివాసి గ్రామాలలో ప్రత్యామ్నాయ మంచినీటి సౌకర్యాలు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. మణుగూరు నుండి బయ్యారం క్రాస్ రోడ్ వరకు 50 లక్షల రూపాయలతో రోడ్లు రిపేర్ చేస్తున్నారని దీని వలన ఉపయోగం లేదన్నారు పెరుగుతున్న రద్దీ, ఇసుక, బొగ్గు రవాణా కారణంగా తీవ్రంగా దెబ్బతిన్న ఈ రోడ్డును అత్యధిక నిధులు కేటాయించి వన్ వే రోడ్డును నిర్మించాలన్నారు. సెంటర్ లైటింగ్ ఏర్పాటు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు గద్దల శ్రీనివాసరావు, మండల కార్యదర్శి సత్రపల్లి సాంబశివరావు, సీనియర్ నాయకులు కొడిశాల రాములు, మండల కార్యదర్శి వర్గ సభ్యులు పిట్టల నాగమణి, మడి నరసింహారావు, మండల కమిటీ సభ్యులు కుంజ రాజు, ఉత్పతల నరసింహారావు, తోట పద్మ ,గుండి భీమయ్య, సున్నం మల్లేష్, దొడ్డి నిర్మల, గుండి రమేష్, ఎస్.కె ఖతీజా బేగం, టేగం సత్యవతి తదితరులు పాల్గొన్నారు.

మణుగూరులో కలెక్టర్ అంకిత్ సుడిగాలి పర్యటన

ప్రజాపక్షం/మణుగూరు: జిల్లా కలెక్టర్ అంకిత్ గురువారం మణుగూరు మండలంలో సుడిగాలి పర్యటన నిర్వహించి పలు ప్రభుత్వ సంస్థల్లో ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా మణుగూరు ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ఆశ్రమ గిరిజన ఉన్నత పాఠశాల, గుండు సింగారం గ్రామంలోని అంగన్వాడీ కేంద్రం, ప్రభుత్వ గిరిజన మోడల్ ప్రాథమిక పాఠశాలను సందర్శించి పరిస్థితులను పరిశీలించారు. ఆసుపత్రిలో వైద్య సేవలు, మందుల సరఫరా, సిబ్బంది హాజరు వంటి అంశాలను పరిశీలించి రోగులతో మాట్లాడి సేవలపై వివరాలు తెలుసుకున్నారు. విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆసుపత్రి పరిశుభ్రతపై కూడా దృష్టి పెట్టాలని అధికారులకు సూచించారు. పాఠశాలల్లో తరగతి గదులు, కంప్యూటర్ ల్యాబ్, కిచెన్ షెడ్, స్టోర్ రూమ్‌లను పరిశీలించి విద్యార్థులతో మాట్లాడారు. పదవ తరగతి విద్యార్థులు పరీక్షలకు సమర్థంగా సిద్ధమై ఈ ఏడాది 100 శాతం ఉత్తీర్ణత సాధించేలా కృషి చేయాలని సూచించారు. మధ్యాహ్న భోజనం నాణ్యత, పరిశుభ్రతను తనిఖీ చేసి ప్రభుత్వం విద్యార్థుల సంక్షేమానికి పెద్దపీట వేస్తుందని, వారికి నాణ్యమైన ఆహారం అందించడం అందరి బాధ్యత అని తెలిపారు. గుండు సింగారం అంగన్వాడీ కేంద్రంలో పిల్లలకు అందిస్తున్న పోషకాహారం, సౌకర్యాలు, పరిశుభ్రత పరిస్థితులను పరిశీలించి చిన్నారులకు పోషకాహారం నాణ్యంగా అందేలా చర్యలు తీసుకోవాలని సిబ్బందికి సూచించారు. ఈ పర్యటనలో సంబంధిత శాఖల అధికారులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మణుగూరు ఓసీ విస్తరణలో భూ నిర్వాసితుల పేర్ల దుర్వినియోగం

కోటి రూపాయల వసూళ్ళ ఆరోపణ



ప్రజాపక్షం/మణుగూరు: సింగరేణి సంస్థ మణుగూరు ఓపెన్ కాస్ట్ (ఓసీ) విస్తరణ నేపథ్యంలో, భూసేకరణ ప్రక్రియలో అక్రమాలు జరుగుతున్నాయని ఆరోపణలు వెల్లువెత్తాయి. అసలు భూ యజమానుల కంటే కొసలోళ్ళ పేర్లను ఎక్కువగా నమోదు చేసి, వారి ద్వారా అధిక మొత్తంలో పరిహారం పొందేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని సమాచారం. సింగరేణి సంస్థ తన బొగ్గు ఉత్పత్తిని పెంచుకునేందుకు మణుగూరు ఓసీని విస్తరించాలని నిర్ణయించింది. ఈ విస్తరణలో భాగంగా భూములు కోల్పోతున్న వారి పేర్లను నమోదు చేసే ప్రక్రియలో అవకతవకలు జరుగుతున్నాయని తెలుస్తోంది. ముఖ్యంగా, గతంలో ఓసీ ఏర్పాటు సమయంలో పరిహారం విషయంలో చక్రం తిప్పిన ఒక వ్యక్తి, ఇప్పుడు కూడా అదే తరహాలో వ్యవహరిస్తున్నారని సమాచారం. ఆ వ్యక్తి, పాత బాండ్లను అధిక ధరకు కొనుగోలు చేసి, వాటిని కొత్తగా నమోదు చేయిస్తున్నట్లు ఆరోపణలున్నాయి. అంతా నేను చూసుకుంటాను అని చెప్పి, కొసలోళ్ళ నుంచి ఒక్కొక్కరి నుంచి లక్ష రూపాయల చొప్పున ఇప్పటికే సుమారు కోటి రూపాయలు వసూలు చేసినట్లు విశ్వసనీయ వర్గాలు తెలిపాయి. ఈ అక్రమాల వల్ల సింగరేణి సంస్థకు ఊహించిన దానికంటే మూడు రెట్లు ఎక్కువ నష్టపరిహారం చెల్లించాల్సి వస్తుందని, తద్వారా సంస్థకు భారీ ఆర్థిక నష్టం వాటిల్లే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు. ఈ వ్యవహారంపై రెవిన్యూ అధికారులకు సమాచారం ఉందా లేదా అనే దానిపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. భూసేకరణ ప్రక్రియలో పారదర్శకత కొరవడిందని, అర్హులైన వారికి న్యాయం జరగడం లేదని బాధితులు ఆరోపిస్తున్నారు. ఈ అక్రమాలపై సమగ్ర విచారణ జరిపి, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు. భూనిర్వాసితులకు న్యాయమైన పరిహారం అందేలా చూడటం, ప్రభుత్వ సంస్థలకు ఆర్థిక నష్టం కలగకుండా నివారించడం అధికారుల బాధ్యత. ఈ విషయంలో రెవిన్యూ, సింగరేణి అధికారులు తక్షణమే స్పందించాల్సిన అవసరం ఉంది.

చేతిపంపులను రిపేర్ చేయించండి

ప్రజాపక్షం/వైరా: వైరా మున్సిపాలిటీ పరిధిలోని బ్రాహ్మణపల్లి హిందూ స్మశానవాటిక వద్ద ఐఎంఎల్ డిపో వద్ద ఉన్న చేతి పంపులు పని చేయడం లేదు. వాటిని రిపేర్ చేపించాలని వైరా పట్టణ తెలుగుదేశం అధ్యక్షుడు బొల్లెపల్లి శ్రీనివాసరావు గురువారం మున్సిపాల్ చైర్‌పర్సన్ డాక్టర్ కాపా చంద్రకళకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ కాపా చంద్రకళ మున్సిపాలిటీలోని చేతిపంపులను రిపేర్ చేపిస్తామని తెలిపారు.

ప్రభుత్వ వైద్యశాలలను సందర్శించిన డీఎంఅండ్‌హెచ్‌ఓ

ప్రజాపక్షం/జూలూరుపాడు: భద్రాద్రి కొత్తగూడెం జిల్లా జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి (డీఎంఅండ్ హెచ్ఓ) గురువారం సుజాతనగర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి రాబోయే మిషన్ హెల్త్100 ప్రత్యేక వైద్య శిబిరం నిర్వహణకు సంబంధించి చేపట్టిన ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా స్పెషలిస్ట్ వైద్యుల కన్సల్టేషన్ గదులు, ప్రయోగశాల సేవలు, ఔషధ పంపిణీ కేంద్రం (ఫార్మసీ), రిజిస్ట్రేషన్, హెల్ప్‌డెస్క్ కౌంటర్లు, రోగుల కోసం వేచిచూసే ప్రదేశాలు, త్రాగునీరు, పారిశుద్ధ్య సదుపాయాలు, ఐఈసీ ప్రచార బోర్డులు, దిశా సూచికలు, బయోమెడికల్ వ్యర్థాల నిర్వహణ విధానం, రోగుల రాకపోకల సమన్వయం వంటి అన్ని అంశాలను సమగ్రంగా సమీక్షించారు. శిబిరానికి హాజరయ్యే లబ్ధిదారులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా సక్రమ ప్రణాళికతో ఏర్పాట్లు చేయాలని, స్పెషలిస్ట్ వైద్యులతో సమన్వయం పాటించాలని, అవసరమైన ఔషధాలు, ల్యాబ్ పరీక్షలు అందుబాటులో ఉంచాలని, ప్రతి విభాగం సమయపాలనతో పని చేయాలని సంబంధిత సిబ్బందికి ఆదేశించారు. అనంతరం నిర్వహించిన ఆశా దినోత్సవ సమావేశంలో పాల్గొని ఆశా కార్యకర్తలు, ఏఎన్ఎం, ఇతర సిబ్బందిని ఉద్దేశించి మాట్లాడారు. మిషన్ హెల్త్100 కార్యక్రమం ప్రధాన లక్ష్యాలను వివరించి, ముఖ్యంగా స్వయం సహాయక సంఘాల మహిళలను సమగ్ర ఆరోగ్య ప్రొఫైల్ స్క్రీనింగ్‌కు సమీకరించడం అత్యంత ప్రాధాన్యంగా తీసుకోవాలని సూచించారు. గ్రామ స్థాయిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించి, గర్భిణీ స్త్రీలు, దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారు, వృద్ధులు, ఇతర అవసరమైన లబ్ధిదారులు శిబిరానికి హాజరయ్యేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ప్రతి వైద్య కేంద్రంలో ఫ్యామిలీ ప్లానింగ్ కార్నర్‌ను బలోపేతం చేసి, కుటుంబ నియంత్రణ సేవలను ప్రజలకు అందుబాటులో ఉంచాలని, అన్ని ఆరోగ్య సూచికలను మెరుగుపరచే దిశగా కృషి చేయాలని సూచించారు. ఫీల్డ్ స్థాయి సిబ్బంది సమన్వయంతో పనిచేసి, మిషన్ హెల్త్100 కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ప్రోత్సహించారు. దీనిలో భాగంగా జూలూరుపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని కూడా సందర్శించి శుక్రవారం నిర్వహించనున్న మిషన్ హెల్త్100 ప్రత్యేక వైద్య శిబిరం ఏర్పాట్లను సమీక్షించారు. ఈ శిబిరంలో ఆరు విభాగాల నిపుణ వైద్యులు సేవలు అందించనున్నారు. సాధారణ వైద్య నిపుణుడు, కంటి వైద్య నిపుణుడు, ఎముకల వైద్య నిపుణుడు, స్త్రీ రోగ నిపుణుడు, శిశు వైద్య నిపుణుడు, దంత వైద్య నిపుణుడు తమ పరిధిలోని అన్ని గ్రామాలలో మైకింగ్ ప్రకటనలు నిర్వహించి, అవసరమైన లబ్ధిదారులను శిబిరానికి సమీకరించాలని వైద్య అధికారులకు ఆదేశించారు. ముఖ్యంగా వృద్ధులు, గర్భిణీలు, చిన్నపిల్లలు మరియు దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారు తప్పనిసరిగా శిబిరానికి హాజరుకావాలని ప్రచారం చేయాలని సూచించారు. మిషన్ హెల్త్100 కార్యక్రమం మిగిలిన 99 రోజుల్లో స్వయం సహాయక సంఘాల మహిళల ఆరోగ్య ప్రొఫైల్ స్క్రీనింగ్‌ను వేగవంతం చేసి, జిల్లా వ్యాప్తంగా సమగ్ర ఆరోగ్య సేవలను ప్రజలకు చేరవేయడం లక్ష్యంగా పని చేయాలని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో వద్యులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కేశవాపురంలో ప్రభుత్వ భూమి గుర్తింపు

-హద్దులు గుర్తించిన రెవెన్యూ అధికారులు
-త్వరలో డొంక వారి సమస్యకు పరిష్కారం

ప్రజాపక్షం/కూసుమంచి: మండలంలోని జీళ్ళ చెరువు రెవెన్యూ పరిధిలోని కేశవాపురం గ్రామంలో ప్రభుత్వ భూమిని కూసుమంచి మండల రెవెన్యూ అధికారులు గుర్తించారు. గ్రామంలోని సర్వే నంబర్లు 537, 538లో ఉన్న ప్రభు త్వ భూమిని అధికారులు పరిశీలించి అధికారికంగా గుర్తించడం జరిగింది. ఈసందర్భంగా భూమి హద్దులను కూడా స్పష్టంగా నిర్ణయించి గుర్తులు పెట్టారు. గ్రామానికి చెందిన రైతు ఇంటూరి నాగరాజు గత 2018 సంవత్సరం నుండి తన వ్యవసాయ చేనుకు సరైన దారి లేక తీవ్ర ఇబ్బందులు పడుతూ వచ్చారు. పలు మార్లు అధికారులకు వినతులు సమర్పిస్తూ సమస్య పరిష్కారానికి ప్రయత్నించారు. రైతు చేసిన నిరంతర కృషి, పట్టుదల ఫలితంగా ఇప్పుడు అతని సమస్యకు పరిష్కారం లభించే పరిస్థితి ఏర్పడింది. రెవెన్యూ అధికారులు ప్రభుత్వ భూమిని గుర్తించి హద్దులు నిర్ణయించడంతో గ్రామంలో ఎన్నో ఏళ్లుగా అపరిస్కృతంగా ఉన్న డొంకదారి సమస్యకు పరిష్కారం లభించనున్నది. కొందరు ఆర్థికంగా భూములు కలిగి ఉన్న రైతులు ఎవరి గట్టు పక్కన ఉన్న ప్రభుత్వ భూమిని వారు ఆక్రమించడంతో ఇన్నాళ్లుగా సమస్యకు పరిష్కారం లేకుండా పోయింది. ఇంకా మరి కొందరు పూర్వం ఉన్నదారులకు అడ్డుగా ఇల్లు నిర్మించుకోవడం ఇంటి జాగా అదనంగా ఉండటంతో దానిని కూడా ప్రభుత్వ అధికారులు గుర్తించడం జరిగింది. ఈ పంటల సీజన్ అనంతరం వేసవికాలంలో ప్రభుత్వ భూమిని స్వాధీనం చేసుకొని గ్రామంలోని గ్రామ పంచాయితీ కార్యాలయము ఇంకా ప్రభుత్వ భవనాలు ఏమి అవసరం ఉంటాయో అటువంటి అవన్నీ నిర్మించుకోవడానికి భూమి అనుకున్నంతగా ఉన్నదని రెవెన్యూ ఇన్స్పెక్టర్ రాము తెలిపారు. ఈకార్యక్రమంలో సర్వేయర్ వెంకట్‌తో పాటు తమ సిబ్బంది పాల్గొన్నారని గ్రామస్తులు కూడా అధికారుల చర్యను స్వాగతిస్తూ రైతుకు దారి సమస్య న్యాయం చేయాలని అభిప్రాయపడ్డారు.

నిర్వాసిత గ్రామాల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలి

ప్రజాపక్షం/మణుగూరు: బిటిపిఎస్, సిఎస్ఆర్ నిధులు నిర్వాసిత గ్రామాల అభివృద్ధికే ఉపయోగించాలని, నిర్వాసిత గ్రామాలలో రోడ్లు, డ్రైనేజీలు, విద్యా, వైద్యం, విద్యుత్తు, త్రాగునీరు తదితర మౌలిక సదుపాయాలు కల్పించాలని సిపిఐ (ఎంఎల్) మాస్ లైన్ (ప్రజాపంథా) మణుగూరు డివిజన్ కార్యదర్శి ఆర్. మధుసూదన్ రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం జిల్లా కలెక్టర్ మణుగూరు పర్యటన సందర్భంగా మణుగూరు లో కలెక్టర్ ని కలిసి ఈ విషయంపై మాట్లాడి, వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బిటిపిఎస్ నిర్మాణం కోసం నిర్వాసిత గ్రామాల ప్రజలు భూములు ఇచ్చి, దాని నుండి వెలువడే కాలుష్యాన్ని భరిస్తూ, రోగాల బారిన పడుతూ ఇబ్బంది పడుతుంటే, నిర్వాసిత గ్రామాల అభివృద్ధి కోసం ఉపయోగించవలసిన బిటిపిఎస్, సిఎస్ఆర్ నిధులను నిర్వాసిత గ్రామాల అభివృద్ధికి ఉపయోగించకుండా, బయటి ప్రాంతాలకు తరలించడం వలన నిర్వాసిత గ్రామాల్లో అభివృద్ధి ఎక్కడ వేసిన గొంగడి అక్కడే అన్న చందంగా తయారైందన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం, ప్రభుత్వ అధికారులు నిర్వాసిత గ్రామాల అభివృద్ధిపై దృష్టి సారించి, బిటిపిఎస్, సిఎస్ఆర్ నిధులను నిర్వాసిత గ్రామాల అభివృద్ధికి ఉపయోగించాలన్నారు. నిర్వాసిత గ్రామాల అభివృద్ధి పట్ల నిర్లక్ష్యం ప్రదర్శిస్తే, మా పార్టీ ఆధ్వర్యంలో కలిసి వచ్చే అందరిని కలుపుకొని ఆందోళన నిర్వహిస్తామన్నారు.

ఇసుక మాఫియాపై విచారణ జరిపి పీడీ చట్టం ప్రయోగించాలి



ప్రజాపక్షం/బూర్గంపాడు: బూర్గంపాడు మండలంలో జరుగుతున్న అక్రమ ఇసుక రవాణాపై విచారణ జరిపించి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని భద్రాద్రి పరిరక్షణ సమితి అధ్యక్షులు డాక్టర్ బూసిరెడ్డి శంకర్‌రెడ్డి అన్నారు. గురువారం మండల కేంద్రంలోని ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మండలంలో ఒక వైపు సాధారణ ప్రజలకు, ఇల్లు నిర్మించుకునే వారికి ఇసుక దొరకని పరిస్థితి ఉండగా, మరో వైపు ఇసుక మాఫియా ముఠాలుగా ఏర్పడి అక్రమంగా ఇసుకను తరలిస్తూ ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతున్నారని ఆరోపించారు. ఇసుక అక్రమంగా తరలిపోతూ ప్రభుత్వానికి లక్షల రూపాయల నష్టం కలుగుతున్నదని, ఈ విషయం స్థానిక మీడియా వాట్సాప్ సమూహాల్లో తరచూ చర్యకు వస్తున్నప్పటికీ సంబంధిత శాఖల అధికారులు చర్యలు తీసుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. అక్రమ ఇసుక రవాణా చేస్తున్న వారిపై పీడీ చట్టం ప్రయోగించి కఠిన చర్యలు తీసుకోవాలని, అలాగే ఇసుక ర్యాంపుల వద్ద కట్టుదిట్టమైన నిఘా ఏర్పాటు చేయాలని కలెక్టర్‌ను కోరారు. అవసరమైతే మండలం వారీగా లేదా ర్యాంపుల వారీగా వేలంపాట ద్వారా ఇసుక ర్యాంపులను కేటాయించాలని సూచించారు. ఈవిషయంపై తగిన చర్యలు తీసుకోవాలని కోరుతూ వినతి పత్రం రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి కూడా పంపినట్లు తెలిపారు.

నర్సరీ నిర్వహణ, కోళ్ల ఫాం షెడ్ పరిశీలన

ప్రజాపక్షం/బూర్గంపాడు: సోంపల్లి గ్రామ పంచాయితీ పరిధిలోని సోంపల్లి గ్రామంలో ఉన్న నర్సరీ, కోళ్లఫామ్ షెడ్‌ను ఏపీవో విజయ లక్ష్మీ గురువారం పరిశీలించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామాల్లో నర్సరీలను సక్రమంగా నిర్వహించడం ద్వారా పచ్చదనం పెంపొందించడంతో పాటు గ్రామాభివృద్ధికి తోడ్పడుతుందని తెలిపారు. మొక్కల సంరక్షణపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. అలాగే కోళ్ల ఫామ్ షెడ్‌ను గ్రామస్తులు సద్వినియోగం చేసుకుంటే ఉపాధి అవకాశాలు పెరుగుతాయని, ఆదాయ వనరులు మెరుగుతాయని పేర్కొన్నారు. ప్రభుత్వం కల్పిస్తున్న సదుపాయాలను ప్రజలు సమర్థవంతంగా ఉపయోగించుకోవాలని సూచించారు. ఈకార్యక్రమంలో ఈసీ నవీన్, టీఏ వెంకటలక్ష్మీ, కాంగ్రెస్ పార్టీ నాయకులు పండగ వెంకటేశ్వర్లు, పంచాయితీ సిబ్బంది పెంకే దారుగ, తదితరులు పాల్గొన్నారు.

సారు పోయించండి.. రోడ్డుపై ఈ కొంచెం తారు..!

ప్రజాపక్షం/అన్నపురెడ్డిపల్లి: మండల పరిధిలోని పెద్దిరెడ్డిగూడెం నుండి కొత్తగూడెం వైపు వెళ్లే జాతీయ రహదారిని క్రాస్ చేస్తున్న సీతారామ లిఫ్ట్ ఇరిగేషన్ కాలువపై గత సంవత్సరం వంతెన నిర్మాణాన్ని చేపట్టడం జరిగింది. నిర్మాణం పూర్తి అయి సంవత్సర కాలం దాటినప్పటికీ ఇప్పటి వరకు వంతెనకు ఇరువైపులా మట్టిని తొలగించకపోగా రోడ్డుకు ఇరువైపులా గుట్టలుగా వదిలేశారు. నిత్యం జాతీయ రహదారిపై కొన్ని వందల వేల వాహనాలు ప్రయాణం సాగిస్తున్నప్పటికీ ధుమ్ము ధూళీ లోతైన గుంటల మధ్యలో వారి ప్రయాణం సాగించవలసి వస్తుంది. పలుమార్లు ఈ ప్రాంతంలో వాహనాలు ప్రమాదాలకు గురి కావడం కూడా జరిగింది. ఈ ప్రాంతంలో తారు పోయవలసిన బాధ్యత జాతీయ హైవే అథారిటీ వారికి సంబంధించిన దా..లేక వంతెన నిర్మాణం చేసిన కాంట్రాక్టర్‌కు సంబంధించినదా అనే విషయం తేలక అయోమక పరిస్థితిలో ఉండిపోయింది. కాంట్రాక్టర్ నిర్లక్ష్య ధోరణికి అద్దం పడుతుంది. ఏది ఏమైనా అప్పటికి నిత్యం ప్రయాణికులు మాత్రం ఎన్నో అవస్థలు పడుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి ప్రమాదాలు జరగకుండా ప్రశాంతమైన ప్రయాణాన్ని ప్రజలకు అందించాలని సారు ఈ రోడ్డుపై కొంచెం తారు పోయించండి అంటూ ఈ ప్రాంత వాసులు వాపోతున్నారు.

పాలేరు మత్స్య పరిశోధన కేంద్రంలో బయోఫ్లాక్ చేపల సాగుపై శిక్షణ ప్రారంభం

ప్రజాపక్షం/కూసుమంచి: పివి నరసింహారావు తెలంగాణ పశువైద్య విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో పాలేరు మత్స్య పరిశోధన కేంద్రంలో బయోఫ్లాక్ విధానంలో చేపల సాగుపై మూడు రోజుల నైపుణ్యాభివృద్ధి శిక్షణ కార్యక్రమం ప్రారంభమైంది. నాబార్డ్ మరియు కేంద్ర వ్యవసాయ మంత్రిత్వ శాఖ ఆర్థిక సహకారంతో నిర్వహిస్తున్న ఈశిక్షణకు ఖమ్మం సహా పలు జిల్లాల నుండి 25 మంది మత్స్య రైతులు, మత్స్యకారులు హాజరయ్యారు. ఈకార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాలేరు సర్పంచ్ బానోతు నాగేశ్వరరావు నాయక్ పాల్గొని మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలు, బ్యాంకు రుణాలను వినియోగించుకుని మత్స్య రైతులు ఆక్వా రంగంలో అభివృద్ధి సాధించాలని సూచించారు. ఈసందర్భంగా మత్స్య శాస్త్రవేత్తలు బయోఫ్లాక్ చేపల సాగు విధానం, నిర్వహణపై రైతులకు అవగాహన కల్పించారు. ఈకార్యక్రమంలో శాస్త్రవేత్తలు, డాక్టర్ కె అరుణ్ కుమార్, సిగ నాగరాజు పాల్గొన్నారు.

సీతమ్మ సహనం, సేవాభావం అందరికీ ఆదర్శం

- సిపిఐ జాతీయ సమితి సభ్యులు భాగం

ప్రజాపక్షం/నేలకొండపల్లి : మండలంలోని భైరవునిపల్లి గ్రామానికి చెందిన సిపిఐ సీనియర్ నాయకురాలు కనకబండి సీతమ్మ సహనం, సేవాభావం నేటి తరానికి ఆదర్శమని సిపిఐ జాతీమయ సమితి సభ్యులు భాగం హేమంతర్‌రావు, జిల్లా కార్యదర్శి దండి సురేష్ అన్నారు. గురువారం భైరవునిపల్లి గ్రామంలో కనకబండి సీతమ్మ సంస్మరణ సభను పార్టీ గ్రామ శాఖ మండల కమిటీల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. తొలుత ఆమె చిత్రపాటానికి పూలమాలలు వేసి పార్టీ నాయకులు, శ్రేణులు నివాళులర్పించారు. అనంతరం పార్టీ మండల కార్యదర్శి మారిశెట్టి వెంకేశ్వరరావు, గ్రామ శాఖ కార్యదర్శి బాలిన కృష్ణంరాజు అధ్యక్షతన జరిగిన సభలో వారు మాట్లాడుతూ..రామాయణంలో సీతమ్మకు తన జీవితంలో ఎన్నో అటు పోట్లు అవాంతరాలు ఎదురైనా ఎంతో ఓపిక, సహనంతో అన్నింటిని అధిగమించిన పరిపూర్ణమైన వ్యక్తిగా మహాశక్తిగా యావత్ సమజానికి స్ఫూర్తిగా నిలిచినట్లుగా మనం చదువుకున్నామన్నారు. కానీ మన కనకబండి సీతమ్మ ఓపిక, సహనానికే పరిమితం కాకుండా జీవితంలో ఎదురైన కష్టాలు, కడగండ్లను ఎదుర్కొనేందుకు ధైర్య సాహసాలను ప్రదర్శిస్తూ ముందుకు నడిచారన్నారు. కనకబండి సీతమ్మ పార్టీ అభివృద్ధి, అనేక సమస్యల పరిష్కారం కోసం ఉద్యమించిన తీరుని అతి దగ్గరగా చూశామన్నారు. ఆమె పోరాట, పటిమా, ఉద్యమ స్ఫూర్తి నేటి సమాజానికి ఆదర్శనీయమన్నారు. సీతయ్య పార్టీలో జిల్లా నాయకుడిగా ఎదగడానికి, గ్రామంలో సర్పంచ్‌గా ప్రజల ఆదరణ పొందడంలో సీతమ్మ ఆయనకు వెన్ను ముక్కలా నిలిచారని కొనియాడారు. గ్రామంలో సిపిఐని అగ్రభాగాన నిలపడంలో సీతమ్మ పార్టీకి అందించిన సలహా, సూచనలు అత్యంత ప్రాధాన్యత కలిగి ఎంతగానో దోహదం చేశాయన్నారు. సీతమ్మ పార్టీ పట్ల అత్యంత విశ్వాసం, అంకితభావం, నిబద్ధతగా పని చేసిన వ్యక్తిగా ప్రతి ఒక్కరికి స్ఫూర్తిదాయకంగా నిలిచారన్నారు. సీతమ్మ పార్టీ అభివృద్ధి, సమాజం కోసం చేసిన సేవలను గుర్తు చేసుకుంటూ, ఆమె ఆశయ సాధన కోసం ప్రతి కార్యకర్త ప్రజా సమస్యలపై ఉద్యమించాలని పిలుపునిచ్చారు. ఆమె మృతికి మరోసారి సంతానం ప్రకటించి, వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా సహాయకార్యదర్శి జమ్ముల జితేందర్‌రెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యులు కర్నాటి భాను ప్రసాద్, సిపిఐ రాష్ట్ర సమితి సభ్యుడు సిద్ధినేని కర్ణకుమార్, ఆర్టీసి ఏఐటీయూసీ జిల్లా కార్యవర్గ సభ్యులు పెద్దపాక వెంకట్, సిపిఐ మండల సహాయ కార్యదర్శి మల్లెబోయిన ఉపేందర్, మండల కార్యవర్గ సభ్యులు కర్నాటి నళినిరాణి, పాల్తియ శ్రీనివాసరావు, భాగం నరసింహారావు, గ్రామ సర్పంచ్ గుండపనేని లక్ష్మణరావు, ఉప సర్పంచ్ ఆలేటి ఉమా మహేష్, జానపద కళాకారుడు పెద్దపాక విజయ్‌కుమార్, గ్రామశాఖ సభ్యులు, వివిధ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

81 సర్వే నెంబర్ ప్రభుత్వ భూమి ఎంత?

-భూమి హద్దులు సంగతి ఏమిటి
-ఆక్రమణకు గురైన భూమి ఎంత?
-ఎవరి పేరు మీద ఆ భూములు బదలాయించారు
-కలెక్టర్ చొరవతో వాస్తవాలు బయటికి..

(ఫైల్)

(ఫైల్)

ప్రజాపక్షం/వైరా: వైరా మున్సిపాలిటీ పరిధిలోని కొణిజర్ల మండలం దిద్దిపూడి రెవిన్యూలో సర్వే నెంబర్ 81లో ఉన్న ప్రభుత్వ భూమి రికార్డుల్లో ఎంత? ప్రస్తుతం అక్కడ ఉన్న భూమి ఎంత? 81 సర్వే నెంబర్‌లో రెండు ఎకరాల భూమిని మున్సిపాలిటీ డంపింగ్‌యార్డ్‌కి కేటాయిస్తే మిగతా ప్రభుత్వ భూమి ఎవరి స్వాధీనంలో ఉంది. కొణిజర్ల మండలం దిద్దిపూడి రెవిన్యూలో ప్రభుత్వ గుట్ట ఆక్రమణకు పాల్పడుతూ రియల్ వ్యాపారులు దానిపై కన్నేశారు అనే విషయాన్ని ప్రజాపక్షం దినపత్రికల్లో వరుస కథనాలు ప్రచురించడం జరిగింది. ఆ కథనాలకు స్పందించిన అప్పటి జిల్లా కలెక్టర్ రెవిన్యూ యంత్రాంగాన్ని సర్వే నెంబర్ 81లో ఉన్న ప్రభుత్వ భూమి వద్దకు పంపించి అక్రమంగా గుట్టను చదువను చేస్తున్న వారి నుండి గుట్టను కాపాడారు. తర్వాత ఆ గుట్టను ఆ విధంగానే వదిలేశారు. అసలు 81 సర్వే నెంబర్‌లో ఉన్న భూమి ఎంత? బంజర భూమి ఎంత? అనే దానిపై అధికారులు నేటి వరకు కూడా అప్పటి నుంచి ఇప్పటి వరకు ఎలాంటి స్పష్టత ఇవ్వలేదు. సర్వే నెంబర్ 81లో అస్సలు ఉన్న ప్రభుత్వ భూమి ఇప్పుడు రికార్డుల్లో ప్రభుత్వపరంగానే ఉందా, ఇతరుల పేరు మీద పట్టాగా మార్చారా అనేది ఇప్పుడు తేలవలసిన అవసరం ఎంతైనా ఉంది. కొంతమంది దిద్దిపూడి రెవిన్యూలోని నిరుపేదలు ప్రభుత్వ భూమిని పేదలకు పంచాలి అని తహశీల్దార్‌కు వినతిపత్రం కడూఆ అందించిన సందర్భాలు ఉన్నాయి. జిల్లా కలెక్టర్ జోక్యం చేసుకొని ప్రభుత్వ భూమి 81 సర్వే నెంబర్ భూమిని ఎవరెవరు ఆక్రమించుకున్నారు. ఏ విధంగా ఆక్రమించుకున్నారు అనే దానిపై విచారణ చేపడితే వాస్తవాలు బయటకు వస్తాయి. ఇప్పటికే 81 సర్వే నెంబర్‌పై పరిసర ప్రాంతాల్లో కొంతమంది పూర్తిగా గుట్టను ఆక్రమించుకునేందుకు ఎన్నో ప్రయత్నాలు చేశారు. ఆ ప్రయత్నాల్లో భాగంగా ఇప్పటికే పెద్ద ఎత్తున ప్రభుత్వ భూమిని కలుపుకొని స్వాధీనంలో చేసుకున్నారు అనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. అసలు 81 సర్వే నెంబర్ హద్దులు ఏమిటి? ఆ హద్దులు ఇప్పుడు ఎక్కడ? ఆ హద్దులను పూర్తిగా స్వాధీనం చేసుకున్నారా అనేది కూడా రెవిన్యూ అధికారులు బయట పెట్టాల్సిన అవసరం ఎంతో ఉంది.

అభివృద్ధి పనుల్లో వేగం పెంచాలి

-కమిషనర్ అభిషేక్ అగస్త్య

ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ : ఖమ్మం నగరంలో జరుగుతున్న అభివృద్ధి పనుల్లో వేగం పెంచి త్వరిత గతిన పూర్తి చేయాలని ఖమ్మం మున్సిపల్ కమిషనర్ అభిషేక్ అగస్త్య తెలిపారు. గురువారం కమిషనర్ అభిషేక్ అగస్త్య 54, 48 డివిజన్లలో క్షేత్ర స్థాయిలో పర్యటించారు. ఆయా డివిజన్లలో జరుగుతున్న పనులను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. 54వ డివిజన్‌లో నిర్మిస్తున్న డ్రైనేజీ, కల్వర్టు పనులను పరిశీలించారు. 48వ డివిజన్‌లో ఎఫ్‌సిఐ గోడౌన్ నుంచి బైపాస్ రోడ్డు వరకు చేపట్టిన రహదారి విస్తరణ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ వర్షాకాలంలో ప్రజలకు ఇబ్బందులు లేకుండా నీటి ప్రవాహం సాఫీగా సాగేలా డ్రైనేజీ పనులను నాణ్యతా ప్రమణాలు పాటించి త్వరిత గతిన పూర్తి చేయాలన్నారు. రహదారి విస్తరణ వల్ల నగరంలో ట్రాఫిక్ రద్దీ తగ్గుతుందని వాహనదారులకు ఎంతో ప్రయోజన కరంగా ఉంటుందన్నారు. విస్తరణ పనుల్లో ఉన్న అడ్డంకులను తొలగించి పనులు వేగవంతంగా పూర్తి చేయాలన్నారు. నగర వ్యాప్తంగా జరుగుతున్న పనులను నిర్దేశిత కాలపరిమితి లోపు పూర్తి చేయాలన్నారు. ప్రజలకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఇంజనీరింగ్ విభాగం అధికారులు, టౌన్ ప్లానింగ్ సిబ్బంది, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యా కమీషన్ సిఫార్సులపై చర్చించాలి

ప్రజాపక్షం/మధిర : తెలంగాణ విద్యా కమిషన్ చైర్మన్ ఆకునూరి మురళీ సమర్పించిన విద్యా విధాన పత్రం 2026ను అమలు చేసే ముందు ఉపాధ్యాయ సంఘాలతో తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం చర్చించాలని తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్(టిఎస్ యూటిఎఫ్) ఖమ్మం జిల్లా కార్యదర్శి షేక్.నాగుర్‌వలీ, ప్రాంతీయ కార్యాలయం మధిర కన్వీనర్ ఎ.వినోద్‌రావు డిమాండ్ చేశారు. గురువారం స్థానిక యూనియన్ కార్యాలయంలో మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బండారు నాగరాజు, ఈ వీరయ్య అధ్యక్షతన జరిగిన మండల ఆఫీస్ బేరర్స్ సమావేశంలో వారు మాట్లాడారు. ప్రభుత్వ విద్యారంగానికి మేలు చేసేవిగా ఉన్నప్పటికీ ఉపాధ్యాయులకు సంబంధించిన కమీషన్ చేసిన సిఫార్సులను చాలా వరకు అభ్యంతకరంగా ఉన్నాయమని తెలిపారు. కమీషన్ సిఫార్సులు ఉపాధ్యాయ వృత్తి గౌరవాన్ని పెంచేవిగా ఎక్కువ మంది ఈ వృత్తిలోకి వచ్చే విధంగా ఉండాలంటే ఎక్కువ వేతనాలు ఉండాలని, జాతీయ విద్యాకమిషన్(కోఠారి కమీషన్) సూచనలకు భిన్నంగా సిఫార్సును చేశారని విచారం వ్యక్తం చేశారు. ఉపాధ్యాయ సంఘాలు సాధించుకున్న అరకొర సౌకర్యాలను కూడా కమీషన్ చాలా ఎక్కువ అనే దృష్టితో వ్యాఖ్యానించడం సరికాదని పేర్కొన్నారు. ఉపాధ్యాయుల పెండింగ్ సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని, అదేవిధంగా విద్యా కమీషన్ సిఫార్సులను అమలు చేసే ముందు ఉపాధ్యాయుల సంఘాలతో చర్చించాలని కోరారు. ఈ సమావేశంలో ప్రాంతీయ కార్యాలయం కోశాధికారి మహమ్మద్ రఫీ, మండల ఉపాధ్యక్షులు షేక్.ఇబ్రహీం, కాజా సునీత, జిబిఎంఎస్ రాణి, జి.విజయలక్ష్మీ, డి.కవిత, చెడే రాణి, మల్లరాజు, వూట్ల కొండలరావు, లంక నాగేశ్వరరావు, బొబ్బిళ్లపాటి రమేష్, అహ్మద్, డి.మహేంద్రకుమార్, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

నేటి నుండి పెనుగంచిప్రోలుకు ప్రత్యేక బస్సులు

ప్రజాపక్షం/ మధిర : మధిర ఆర్టిసి డిపో నుండి ఆంధ్రప్రదేశ్‌లోని కృష్ణాజిల్లా పెనుగంచిప్రోలు శ్రీ లక్ష్మీ తిరుపతమ్మ గోపయ్య దేవస్థానం నందు తిరునాళ్ల సందర్భంగా రెండు రోజుల పాటు ప్రత్యేక బస్సు సర్వీసులను ఏర్పాటు చేసినట్లు డిపో మేనేజర్ ఆర్.రామయ్య గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 6, 7వ తేదీల్లో మధిర బస్టాండ్, కాంగ్రెస్ కార్యాలయం నుండి పెనుగంచిప్రోలుకు ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని మధిర, పరిసర ప్రాంతాల భక్తులు, ప్రయాణీకులు సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు. భక్తుల రద్దీకి అనుగుణంగా బస్సులు ఏర్పాటు చేస్తామని వారు తెలిపారు.

40శాతం సబ్సిడీతో వ్యవసాయ డ్రోన్లు

ప్రజాపక్షం/ మధిర : తెలంగాణ ప్రభుత్వం వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చడమేకాకుండా సాగులో లెటెస్ట్ టెక్నాలజీని ప్రవేశపెట్టేందుకు డ్రోన్లను 40శాతం సబ్సిడీతో రైతులకు ఇవ్వటం జరుగుతుందని మధిర సహాయ వ్యవసాయ సంచాలకులు ఎస్.విజయచంద్ర తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు శ్రమ తగ్గించి దిగుబడి పెంచడమే ఈ పథకం వెనుక ఉన్న లక్ష్యమని, ఒక్కో డ్రోన్ కొనుగోలుపై 40శాతం సబ్సిడీ, రూ.4లక్షల వరకు రాయితీ ఇవ్వనున్నట్లు తెలిపారు. ఈ పథకంలో మొదటి విడతలో భాగంగా మధిర డివిజన్‌లో రెండు డ్రోన్లను సబ్సిడీ మీద ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. నేరుగా రైతులకే కాకుండా రైతు ఉత్పత్తిదారుల సంఘాలు, ప్రాథమిక సహకార సంఘాలకు, మహిళా సంఘాలకు మంజూరు చేయడం జరుగుతుందని తెలిపారు. లెటెస్ట్ టెక్నాలజీతో ప్రవేశపెట్టిన డ్రోన్ల వలన వ్యవసాయ కూలీ ఖర్చులు, సమయం దాదాపు 80శాతం వరకు తగ్గుతుందని తెలిపారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని, డ్రోన్లు కావాల్సిన రైతులు మండల వ్యవసాయ అధికారి, వ్యవసాయ విస్తరణాధికారి కార్యాలయాల్లో సంప్రదించి దరఖాస్తు చేసుకోవాలని వారు సూచించారు.

గర్భాశయ ముఖ ద్వారా క్యాన్సర్‌పై అవగాహన

ప్రజాపక్షం/ మధిర : మధిర పట్టణంలోని స్థానిక టివిఎం హైస్కూల్ విద్యార్థినిలకు గర్భాశయ ముఖ ద్వారా క్యాన్సర్‌పై మండల పిహెచ్‌సి వైద్యాధికారి డాక్టర్ పృథ్వీరాజ్ నాయక్ ఆధ్వర్యంలో గురువారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ఆడపిల్లలకు వచ్చే గర్భాశయ ముఖ ద్వారా క్యాన్సర్‌పై విద్యార్థినిలకు సంపూర్ణంగా అవగాహన కల్పించారు. అదేవిధంగా త్వరలో నిర్వహించనున్న హెచ్‌పివి వ్యాక్సిన్ కార్యక్రమంలోభాగంగా 14 సంవత్సరాల నుండి 15 సంవత్సరాలలోపు ఆడ పిల్లల వివరాలను ఆరోగ్య సిబ్బంది సర్వే చేసి ఏజ్ గ్రూప్ కార్యక్రమం నిర్వహించటం జరుగుతుందని తెలిపారు. అలాగే త్వరలో జరుగనున్న పబ్లిక్ పరీక్షల్లో విద్యార్థినిలు ఎటువంటి మానసిక ఒత్తిళ్లకు లోను కాకుండా ప్రశాంతంగా పరీక్షలు రాయాలని, పరీక్షల సమయంలో మానసికంగా ఆరోగ్యపరంగా సమస్యలు వస్తే ఆరోగ్య వైద్య సిబ్బంది ద్వారా ఉచితంగా వైద్య సేవలు అందించటం జరుగుతుందని తెలిపారు. ఈకార్యక్రమంలో కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ వి.వెంకటేశ్వర్లు, మధిర పల్లె దవఖానా వైద్యురాలు డాక్టర్ జాహ్నవి, టివిఎం హెచ్‌ఎం సత్యజిత్‌రావు, హెల్త్ సూపర్వైజర్ లంకా కొండయ్య, ఇతర ఆరోగ్య సిబ్బంది, ఎఎన్‌ఎంలు తదితరులు పాల్గొన్నారు.

ప్రజాపాలన.. ప్రగతి ప్రణాళిక...!

ప్రజాపక్షం/నేలకొండపల్లి : తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టనున్న ప్రజాపాలన...ప్రగతి ప్రణాళికల కార్యక్రమం షెడ్యూల్ ప్రకటించారు. 99 రోజుల పాటు వివిధ కార్యాక్రమాలు చేపట్టనున్నారు. అందుకు సంబంధించిన కార్యచరణ ను రూపొందించారు. ఈ కార్యక్రమం ను విజయవంతం చేసేందుకు అన్ని శాఖల ను భాగస్వామ్యులు గా చేర్చింది. ఈ నెల 6 నుంచి జూన్ 12 వరకు ఏ కార్యక్రమాలు చేపట్టాలి...ఏ శాఖలు చేయాలి అనే విషయాల పై సంబంధిత అధికారులకు షెడ్యూల్ ను విడుదల చేశారు. జూన్ 2 న రాష్ట్ర ఆవతరణ దినోత్సవం ఘనంగా నిర్వహించేందుకు తగిన ఏర్పాట్లు పై కార్యచరణ ను సిద్ధం చేశారు. గ్రామ స్థాయిలో ఏప్రిల్ 2, మండల స్థాయి లో 16, మే 2 న, జిల్లా స్థాయి లో 22 న, రాష్ట్ర స్తాయిలో జూన్ 2 న ఉత్సవాలు నిర్వహించాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది.

99 రోజుల పాటు కార్యాచరణ ఇవి....

తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన ప్రజాపాలన...ప్రగతి ప్రణాళికల ను విజయవంతం చేసేందుకు ముఖ్యంగా ప్రధానంగా 10 ప్రధాన అంశాలను ప్రతిపాదించబడింది. వీటి పైనే ప్రత్యేక దృష్టి సారించాల్సి ఉంది. వాటిలో ఇవి....

పరిసరాల పరిశుభ్రత మరియు ప్రభుత్వ కార్యాలయాలలో ఫైళ్ల పరిష్కారం.
ఆరోగ్యం
సురక్షితంగా చేరుకోండి
సంక్షేమం
పిల్లల భద్రత మరియు రక్షణ డ్రగ్స్ కు నో
రైతులు వ్యవసాయం.
విద్య
యువత మరియు క్రీడలు
మహిళలు
పర్యావరణ.
గ్రామ సభలో చర్చించే విషయాలు.....
రాష్ట్ర గీతం ప్రారంభం...5..నిమిషాలు.
సీఎం వీడియో సందేశం ప్రదర్శన..10..నిమిషాలు
శాఖల అధికారుల ద్వారా సాధించిన విజయాలపై సమాచారం... 15..నిమిషాలు
లబ్ధిదారుల అభిప్రాయాలు..30..నిమిషాలు.
ప్రజాప్రతినిధుల సందేశం...30..నిమిషాలు
ముగింపు...
మొత్తం సమయం.....90 నిమిషాలు.

-99 రోజుల కార్యచరణ కార్యక్రమాలు
-నేటి నుంచి జూన్ 12 వరకు షెడ్యూల్

ప్రగతి ప్రణాళికలు ప్రకారం చేపట్టాలి :
పసుమర్తి శ్రీనివాస్, సామాజిక కార్యకర్త, నేలకొండపల్లి.

తెలంగాణ ప్రభుత్వం చేపట్టనున్న ప్రగతి ప్రణాళికలు చేయటం మంచిదే...పాలకవర్గాలు కూడ ప్రణాళికలు ప్రకారమే చేపట్టే విధంగా చర్యలు తీసుకోవాలి. ప్రతీ పని చేపట్టే ముందు పంచాయతీ బోర్డు పై ఏర్పాటు చేయాలి. ప్రజలందరికి తెలియజేయాలి.

ప్రణాళికలు సరే...నిధుల సంగతేంటి :
కమదన ప్రవీణ్, తిరుమలాపురం, సర్పంచ్,

ప్రజా పాలన...ప్రగతి ప్రణాళికలు చేపట్టడం చాలా సంతోషం.కానీ ప్రభుత్వం అందుకు తగ్గట్టుగా నిధులు కేటాయించాలి. అంతే కానీ నిధులు లేకుండా కార్యక్రమం చేపట్టటం వలన ఉపయోగం ఉండదు. అందుకే ప్రభుత్వం వెంటనే నిధులు కేటాయించి కార్యక్రమాలు చేపట్టే విధంగా చర్యలు తీసుకోవాలి.

షెడ్యూల్ ప్రకారం చేపట్టాలి :
యం.యర్రయ్య, ఎంపీడీఓ, నేలకొండపల్లి.

ప్రజాపాలన...ప్రగతి ప్రణాళిక కార్యక్రమం షెడ్యూల్ ప్రకారం చేపట్టాలి. అన్ని పంచాయతీలలో కార్యక్రమం ను విజయవంతం చేసేందుకు తగిన చర్యలు తీసుకోవాలి. కార్యక్రమం పట్ల అధికారులు నిర్లక్ష్యం చేయవద్దు. ఈ కార్యక్రమంలో అందరిని భాగస్వామ్యులను చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

వరిలో అగ్గి తెగులుతో బుగ్గి అవుతున్న రైతు

- కోత దశలో వరి పంటలపై అగ్గి తెగులు దాడి
- రైతుల్లో తీవ్ర ఆందోళన

ప్రజాపక్షం/ బోనకల్ : జిల్లాలోని పలు మండలాల్లో సాగు చేసిన వరి పంటల్లో అగ్గి తెగులు విస్తరిస్తుండటంతో రైతులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పంట కోత దశకు చేరుకునే సమయంలో ఈ తెగులు రావడం రైతులకు పెద్ద దెబ్బగా మారింది. మొదట వరి ఆకులపై చిన్నచిన్న గోధుమ రంగు మచ్చల రూపంలో కనిపించే ఈ తెగులు క్రమంగా మొత్తం ఆకును ఎండబెట్టి మొక్కలు పెరుగుదలకు దెబ్బతీస్తోంది. వ్యవసాయ నిపుణుల ప్రకారం ఈ అగ్గి తెగులు ఎక్కువగా అధిక తేమ, వర్షాలు, పొలాల్లో నీరు నిల్వ ఉండటం వంటి పరిస్థితుల్లో వేగంగా వ్యాపించే అవకాశం ఉందని వ్యవసాయాధికారులు చెబుతున్నారు. సరైన సమయంలో నివారణ చర్యలు తీసుకోకపోతే పంట దిగుబడి గణనీయంగా తగ్గే ప్రమాదం ఉందని హెచ్చరిస్తున్నారు. ఈ సీజన్‌లో వరిసాగు కోసం రైతులు భారీగా ఖర్చు చేశారు. విత్తనాలు ఎరువులు కార్మిక వ్యయాలు పెరగడంతో ఎకరాకు రూ.25వేల నుంచి రూ.35వేల వరకు పెట్టుబడి పెట్టారు. అయితే ఇప్పుడు పంట కోత దశలో ఉండగా అగ్గి తెగులు విస్తరించడంతో రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికే కొన్ని గ్రామాల్లో వరి ఆకులు ఎండిపోవడం ప్రారంభమైందని రైతులు చెబుతున్నారు. పంటను కాపాడుకునేందుకు రైతులు ఫంగి సైడ్ మందులు పిచికారీ చేస్తున్నారు. కాని మార్కెట్‌లో మందుల ధరలు అధికంగా ఉండటంతో రైతులపై మరింత ఆర్థిక భారం పడుతోంది. ఒక వైపు సాగు ఖర్చులు పెరగడం, మరోవైపు తెగులు నివారణ ఖర్చులు పెరగడం రైతులను ఆర్థికంగా ఇబ్బందులకు గురి చేస్తోంది. ఇక రైతులు వ్యవసాయశాఖ అధికారులు వెంటనే గ్రామాలకు వచ్చి పంటలను పరిశీలించాలని కోరుతున్నారు. అలాగే అగ్గి తెగులు వల్ల నష్టపోయే రైతులకు ప్రభుత్వం తక్షణమే పరిహారం ప్రకటించాలని డిమాండ్ చేస్తున్నారు.

అగ్గి తెగులుతో నష్టపోయాం:
రైతు యాదాల చిట్టిబాబు
(బ్రాహ్మణపల్లి)

అర ఎకరంలో వ్యవసాయం చేశాను. ఇప్పటికే రూ.50వేలు ఖర్చు పెట్టాను. కాని అగ్గి తెగులుతో చాలా ఇబ్బందులకు గురవుతున్నాం. ప్రభుత్వమే ఆదుకోవాలని వేడుకుంటున్నాం.

పది విద్యార్థులకు వీడ్కోలు వేడుకలు

ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ : ఖమ్మం నగరంలోని త్రివేణి పాఠశాలలో పదవ తరగతి విద్యార్థులకు వీడ్కోలు వేడుకలను ఘనంగా నిర్వహించారు. గురు వారం ఖమ్మం నగరంలోని హరిత గార్డెన్స్ నందు నిర్వహించిన వీడ్కోలు వేడుకలకు ముఖ్య అతిథిగా ప్రముఖ న్యూరో సైకియాట్రిస్టు దివ్యారెడ్డి పాల్గొ న్నారు. విద్యార్థులకు పరీక్షలకు సంబంధించి పలు సూచనలు చేశారు. పరీక్షల్లో భయం లేకుండా, ఒత్తిడికి గురికాకుండా రాయాలని సూచించారు. సోషల్ మీడియాకు దూరంగా ఉండాలన్నారు. త్రివేణి పాఠశాల డైరెక్టర్ గొల్లపూడి వీరేంద్ర చౌదరి తన సందేశంలో గత 22 సంవత్సరాలుగా ఖమ్మం త్రివేణి పాఠశాలలో పదవ తరగతిలో అనేక రాష్ట్ర స్థాయి ర్యాంకులు సాధించిందన్నారు. ఈ ర్యాంకుల సాధనలో ఉపాధ్యాయుల సహకారంతో పాటు తమ పాఠశాల అనుసరిస్తున్న ప్రణాళిక కారణమన్నారు. భవిష్యత్తులో కూడా మంచి ర్యాంకులు సాధించాలని విద్యార్థులకు సూచించారు. ప్రిన్సిపాల్ రాజేంద్ర ప్రసాద్ మాట్లాడుతూ త్రివేణి విద్యార్థులంటేనే ర్యాంకర్లని, సుగుణాల బ్యాంకర్లని పది ఫలితాలలో మాకు మేమే పోటీ అని తెలిపారు. పదవ తరగతి విద్యార్థులు తమ అనుభూతులను వివరించారు. పలు సాంస్కృతిక కార్యక్రమాలు ప్రదర్శించారు.ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ స్వప్న, ముస్తఫా, నయూమ్, పదవ తరగతి ఇంచార్జి శ్రీధర్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

పది విద్యార్థులకు పరీక్ష సామగ్రి పంపిణీ

ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ : పదవ తరగతి విద్యార్థులకు సన్‌రైజ్ అభ్యుదయ సేవా సమితి ఆధ్వర్యంలో పరీక్ష సామగ్రిని పంపిణీ చేశారు. గురువారం ఖమ్మం అర్బన్ మండల పరిధిలోని మల్లెమడుగు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో సన్‌రైజ్ అభ్యుయద సేవా సమితి ఆధ్వర్యంలో పదవ తరగతి విద్యార్థులకు రూ. 15వేల విలువ చేసే పరీక్ష సామగ్రిని తల్లాడ మండల పంచాయతీ అధికారి ఏనుగు సురేష్ బాబు చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సురేష్ బాబు మాట్లాడుతూ సన్‌రైజ్ సంస్థ ద్వారా విద్యార్థులకు పరీక్ష సామగ్రిని పంపిణీ చేయడం అభినందనీయమన్నారు. విద్యార్థులు పట్టుదలతో చదివి ఒత్తిడికి గురికాకుండా పరీక్షలు రాసి మంచి ఫలితాలు సాధించాలని తెలిపారు. ఉత్తమ ఫలితాలు సాధించి గురువులతో పాటు తల్లిదండ్రులకు, గ్రామానికి మంచి పేరు తీసుకురావాలన్నారు. సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు మాలతిదాస్ మాట్లాడుతూ సన్‌రైజ్ సంస్థ ద్వారా రెండు తెలుగు రాష్ట్రాల్లో పలు ప్రాంతాల్లో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సన్‌రైజ్ సంస్థ ద్వారా విద్యార్థులకు పరీక్ష సామగ్రి పంపిణీ చేయడం హర్షణీయమని పాఠశాల ప్రధానోపాధ్యాయులు సాంబమూర్తి తెలిపారు. సన్‌రైజ్ సేవలు మున్ముందు మరింత విస్తరించాలని ఆయన తెలిపారు.ఈ కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు, ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

జిల్లా ప్రధాన న్యాయమూర్తిని కలిసి కలెక్టర్

ప్రజాపక్షం/ కొత్తగూడెం : జిల్లా కలెక్టర్‌గా నూతనంగా బాధ్యతలు చేపట్టిన అంకిత్ గురువారం జిల్లా ప్రధాన న్యాయమూర్తి వసంత పాటిల్‌ను జిల్లా కోర్టు కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించినందుకు న్యాయమూర్తి ఆయనకు శుభా కాంక్షలు తెలిపారు. జిల్లాలో ప్రజలకు మెరుగైన సేవలను అందించేందుకు అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేయాలని ప్రధాన న్యాయమూర్తి సూచించారు.

కలెక్టర్‌ను కలిసిన సిపిఐ నాయకులు

ప్రజాపక్షం/పాల్వంచ : సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ముత్యాల విశ్వనాధం ఆధ్వర్యంలో సిపిఐ నాయకులు నూతనంగా జిల్లా కలెక్టర్‌గా బాధ్యతలను చేపట్టిన అంకిత్‌ను గురువారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సంధర్భంగా కలెక్టర్‌ను శాలువాతో సత్కరించి పూలబొకే అందజేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు వీసంశెట్టి పూర్ణచందర్‌రావు, 47వ, డివిజన్ కార్పోరేటర్ గుర్రం వెంకటేశ్వర్లు, నాయకులు బర్ల వెంకటరత్నం, నామా నవీన్, నామా పండు, లాల్‌పాషా, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

ఖమ్మంను క్లీన్ అండ్ గ్రీన్ సిటీగా మార్చడమే లక్ష్యం

-99 రోజుల ప్రత్యేక కార్యాచరణపై కమిషనర్ సమావేశం

ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ : ఖమ్మం నగరాన్ని క్లీన్ అండ్ గ్రీన్ సిటీగా మార్చడమే లక్ష్యంగా 99 రోజుల ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక రూపొందించినట్లు ఖమ్మం కార్పోరేషన్ కమిషనర్ అభిషేక్ అగస్త్య తెలిపారు. గురువారం కార్పోరేషన్ కార్యాలయంలో 99 రోజుల ప్రత్యేక కార్యాచరణ ప్రణాళికపై కమిషనర్ అభిషేక్ అగస్త్య అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నగర ప్రజలకు మెరుగైన పౌర సేవలు అందించడమే కాకుండా నగరాన్ని ఆదర్శవంతంగా తీర్చిదిద్దేందుకు ప్రణాళికలు రూపొందించామన్నారు. నగరంలోని 60 డివిజన్లలో అభివృద్ధి పనులను వేగవంతం చేయడంతో పాటు పలు కార్యక్రమాలు అమలు చేయనున్నట్లు ఆయన తెలిపారు. 99 రోజుల కార్యాచరణ ప్రణాళికలో భాగంగా ప్రతి రోజు ఆరు డివిజన్ల చొప్పున సిబ్బంది ఆధ్వర్యంలో డివిజన్లలో పారిశుధ్య పనులు ఇతర కార్యక్రమాలు చేపట్టనున్నట్లు తెలిపారు. అందుకు అవసరమైన సిబ్బందిని, యంత్రాలను కూడా కేటాయించినట్లు తెలిపారు. నగరంలో గుర్తించిన 168 గుంతలను పూడ్చడం, డివిజన్లలో వెలగని వీధి దీపాలను గుర్తించి పునరుద్ధరించడం జరుగుతుందన్నారు. ఖాళీ స్థలాలు, రహదారుల వెంబడి పేరుకుపోయిన చెత్తను, పిచ్చి మొక్కలను తొలగించడం జరుగుతుందన్నారు. నగరంలో పచ్చదనాన్ని పెంపొందించేందుకు డివిజన్లలో కొత్త నర్సరీలను ఏర్పాటు చేయడంతో పాటు రహదారుల వెంబడి మొక్కలు నాటనున్నట్లు తెలిపారు. పెండింగ్‌లో ఉన్న ఎల్ ఆర్ఎస్ దరఖాస్తులను పరిష్కరించడం, బిల్డింగ్ పర్మిషన్లు, మ్యూటేషన్ ఫైళ్లను పూర్తి చేయనున్నట్లు తెలిపారు. పౌర సేవలను మరింత విస్తృత పర్చడం జరుగుతుందన్నారు. వాట్సాప్ ద్వారా ప్రజలు ఫిర్యాదులు అందించేలా తగు చర్యలు తీసుకుంటున్నామన్నారు. కార్పోరేషన్ పరిధిలోని అన్ని విభాగాల్లో పారదర్శకత కోసం ఈ ఆఫీస్ విధానాన్ని అమలు చేయనున్నట్లు తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరికి ప్రభుత్వ పథకాలను అందించేలా చూస్తామన్నారు. ఖమ్మం నగరాన్ని క్లీన్ అండ్ గ్రీన్‌గా మార్చడంతో పాటు ప్రజలకు మెరుగైన సేవలను అందించడం, సమస్యల పరిష్కారమే లక్ష్యంగా 99 రోజుల కార్యాచరణ ప్రణాళిక రూపొందించినట్లు కమిషనర్ తెలిపారు.

మారుమూల గిరిజనుల ఆరోగ్య బాధ్యత మీదే..

- నీతి అయోగ్ కన్సల్టెంట్ ఉమాంగ్ కటోచ్
- భద్రాచలం ఏరియా ఆస్పత్రి ఆకస్మికంగా తనిఖీ

ప్రజాపక్షం/భద్రాచలం : మారుమూల గిరిజనుల ఆరోగ్య స్థితిగతులు, ముఖ్యంగా నవజాత శిశు రమణాలు జరగకుండా చేసే బాధ్యత సంబంధిత వైద్యాధికారులదే అని నీతి అయోగ్ కన్సల్టెంట్ ఉమాంగ్ కచోట్ అన్నారు. గురువారం భద్రాచలం ఏరియా ఆస్పత్రిని జిల్లా అధికారులతో కలిసి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆస్పత్రిలో జరుగుతున్న మాతృ, నవజాత శిశు సంరక్షణ సేవలు ఎలా అందుతున్నాయి. సదుపాయాలు, మెటర్నటీ వార్డ్, ఎస్ఎన్‌సియు, ఎన్ఆర్‌సిఎయు వంటి విభాగాలను సందర్శించి అక్కడ అందుతున్న సేవలపై ఆరా తీశారు. లేబర్ రూములో సాధారణ ప్రసవాలు ఎలా నిర్వహిస్తున్నారనే దానిపై అడిగి తెలుసుకున్నారు. ప్రసవం అనంతరం బేబీలను బరువు పరీక్షించడం, అందుకు అవసరమైన పరికరాలు ఏమేమి ఉన్నాయి అనేదానిపై నిశితంగా పరిశీలించి రిజిష్టర్లను తనిఖీ చేశారు. నవజాత శిశువుల పరిస్థితి, వారికి అందిస్తున్న సేవలు అడిగి తెలుసుకున్నారు. నవజాత శిశువుల మరణాల రేటు పై ప్రత్యేకంగా ఆరా తీశారు. భద్రాచలం ఎస్ఎన్‌సియు మరణాల రేటు తక్కువగా ఉండటాన్ని గమనించిన ఆయన పని తీరు, కారణాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇతర జిల్లా కంటే భద్రాద్రి జిల్లాలో నవజాత శిశు మరణాలరేటు తక్కువగా ఉందని, గిరిజనులకు కూడా వైద్య సేవలు సక్రమంగా అందుతున్నాయని సంతృప్తి వ్యక్తం చేశారు. మారుమూల గిరిజనులకు మరిన్ని మెరుగైన సేవలు అందించేందుకు కావాల్సిన వస్తు సామాగ్రిపై ప్రతిపాదనలు చేసి పంపించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మైనార్టీ అధికారి సంజీవరావు, నీతి అయోగ్ అసిస్టెంట్ కన్సల్టెంట్ వననీత్, ఏరియా ఆస్పత్రి ఆర్ఎంఓ డా. రాజశేఖర్, పర్యవేక్షకుడు రామకృష్ణ, వైద్యాధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులు తమ భవిష్యత్తుకు తామే పునాది వేసుకోవాలి

-మణుగూరు డిఎస్పి రవీందర్ రెడ్డి
-మణుగూరు సింగరేణి ఉన్నత పాఠశాల విద్యార్థులతో ముఖాముఖి

ప్రజాపక్షం/మణుగూరు: విద్యార్థులు తమ భవిష్యత్తుకు తామే పునాది వేసుకోవాలని మణుగూరు డిఎస్పి రవీందర్ రెడ్డి అన్నారు. గురువారం మణుగూరు సింగరేణి ఉన్నత పాఠశాల విద్యార్థులతో ముఖాముఖి పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఆర్ కళ్యాణి అధ్యక్షతన నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన మణుగూరు డిఎస్పి రవీందర్ రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు తమ దైనందిన జీవితంలో ఎదురయ్యే వివిధ సమస్యలను ఎదుర్కొనేందుకు విచక్షణతో ముందుకు సాగాలన్నారు. ఈ వయసులో అనేక హార్మోనల్ అసమతుల్యత వల్ల, మనని ప్రభావితం చేసే వివిధ సామాజిక మాధ్యమాల వల్ల, చెడు వ్యసనాలకు లోనయ్యే ప్రమాధం ఉందని, వీటికి దూరంగా ఉంటూ చదువు పైనే దృష్టి మరల్చాలని, కోరుతూ, దుర్వ్యసనాల వల్ల సమాజంలో జరుగుతున్న వివిధ పరిణామాలను ఉదాహరణలతో వివరించారు. మైనర్ విద్యార్థులు వాహనాలు నడపడం నిషేధమని, తద్వారా వారి తల్లిదండ్రులకు కూడా కేసు నమోదవుతుందన్నారు. విద్యార్థులు అడిగిన అనేక ప్రశ్నలకు వారు సమాధానాలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సీనియర్ ఉపాధ్యాయులు ఎం వేణు, మస్తానయ్య, లలిత మమత, రాజా సింహ, దయానంద్, స్రవంతి, కళ్యాణ్, రజిత తదితరులు పాల్గొన్నారు.

శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి : ఐడిడిఏ పిఓ రాహుల్

ప్రజాపక్షం/భద్రాచలం : నిరుద్యోగ గిరిజన యువతీయువకులకు ఐటిడిఏ ద్వారా అందించిన ఉచిత శిక్షణ సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా బలపడాలని ఐటిడిఏ ప్రాజెక్టు అధికారి బి రాహుల్ సూచించారు. వైటిసిలో 60 రోజుల పాటు ఎలక్ట్రానిక్ హార్డ్ వేర్ శిక్షణ పూర్తి చేసుకున్న వారికి గురువారం తన ఛాంబర్లో ధృవీకరణ పత్రాలు అందించారు. ఈ సందర్భంగా పిఓ మాట్లాడుతూ పై చదువులు చదివి ఖాళీగా ఉండకుంటూ ఇలాంటి వృత్యాంతర శిక్షణలు నేర్చుకుని జీవనోపాధిని కల్పించుకోవాలన్నారు. ప్రస్తుత కంప్యూటర్ యుగంలో అంతా కమ్యూటర్ మయమని, ఈ హార్డ్ వేర్ శిక్షణ జీవితాలకు భరోసా కల్పిస్తుందన్నారు. శిక్షణ తీసుకున్న వారికి సచేందర్ , డిమార్ట్ కంపెనీ వారు ఉద్యోగ భృతి కల్పించేందుకు ముందుకు వచ్చారని, ఈ అవకాశాన్ని అందిపుచ్చుకుని పైకి ఎదగాలని రాహుల్ సూచించారు. రాబోయే రోజుల్లో ప్రభుత్వం సంస్థల్లో ఉద్యోగాలు పొందేందుకు అనుభవం కూడా వస్తుందన్నారు. మరోప్రక్క సొంతగా హార్డ్ వేర్ చేసుకుని కూడా జీవనోపాదిని పొందవచ్చని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఏపిఓ జనరల్ డేవిడ్ రాజ్, జేడిఎం హరికృష్ణ, శిక్షకురాలు భవాని, ప్రాజెక్టు కో ఆర్డినేటర్ మహేష్, వార్డెన్ దీనాకుమారి, గిరిజన యువతీ యువకులు పాల్గొన్నారు.

గిరిమాల్స్ అందంగా ముస్తాబు చేయాలి

ప్రజాపక్షం/భద్రాచలం : పట్టణంలో నిర్మాణం చేపడుతున్న గిరిమాల్స్ ఆకట్టుకునేలా అందగా ముస్తాబు చేయాలని, అందుకు సంబందించిన పనులు వేగవంతం చేయాలని ఐటిడిఏ ప్రాజెక్టు అధికారి బి రాహుల్ సంబంధిత అధికారులను ఆదేశించారు. గురువారం భద్రాచలం పట్టణంలో ఐటిడిఏ ద్వారా చేపడుతున్న గిరిమాల్ట్ పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఇంజనీరింగ్ అధికారులకు పిఓ పలు సూచనలు చేశారు. ఈనెల 10వ తేది నాటికి సివిల్ పనులు మొత్తం పూర్తి కావాలన్నారు. శ్రీరామ నవమి పండుగ కంటే ముందే గిరి మాల్ట్ ప్రారంభించడానికి సన్నాహాలు చేయాలన్నారు. చూపరులను ఆకట్టుకునేలా ముందు భాగం అందమైన డిజైన్ చేయాలన్నారు. గిరిజన మహిళలకు జీవనోపాధిని కల్పించేందుకు, ఆదివాసీ గిరిజన కుటుంబాల వారికి, పట్టణ ప్రజలకు కల్తీలేని పలు రకాల నిత్యవసరాలు అమ్మకాలు చేసేందుకు ఏర్పాటు చేస్తున్న గిరిమాల్ట్ పనులు నాసిరకంగా కాకుండా నాణ్యతగా ఉండేలా చేసి త్వరితగతిన పూర్తి అయ్యేలా చూడాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సహాయ ప్రాజెక్టు అధికారి డేవిడ్ రాజ్, ఇఇ మధుకర్ తదితరులు పాల్గొన్నారు.

సామర్థ్యాల సాధన కోసం ఉపాధ్యాయులు కృషి చేయాలి

ప్రజాపక్షం/పాల్వంచ : విద్యార్థుల్లో కనీస సామర్థ్య సాధన కోసం ఉపాధ్యాయులు కృషి చేయాలని, తహశీల్దార్ దారా ప్రసాద్, మండల విద్యాధికారి ఎం.శ్రీరామమూర్తిలు అన్నారు. పాల్వంచ పట్టణ కేటిపిఎస్ ప్రాథమిక పాఠశాలలో ఎఫ్ఎల్ఎస్ బాలమేళాను గురువారం ఆయన ప్రారంభించారు. ఈ సంధర్భంగా మండలంలోని ప్రాథమిక పాఠశాలలో అలాగే కాంప్లెక్స్ వారీగా నిర్వహించిన బాలమేళాలో ప్రతిభ కనభరిచిన 50 మంది విద్యార్థులను మండల స్థాయి బాలమేళాకు ఎంపిక చేశారు. వారిలో ఒకటి నుండి 5వ, తరగతి వరకు ఎఫ్ఎల్ఎస్ సామర్థ్యాలపై ఐదుగురిని, లైబ్రరీపై స్టోరీ టెల్లింగ్‌లో మరో ఐదుగురిని ఎంపిక చేశారు. వీరికి తహశీల్దార్ దారా ప్రసాద్, ఎంఈఓల చేతుల మీదుగా ప్రశంసా పత్రాలు, బహుమతులను అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ మండల స్థాయిలో ఎంపికైన 10 మంది విద్యార్థులను ఈ నెల 9న జరిగే జిల్లాస్థాయి బాలమేళాకు పంపించనున్నారని చెప్పారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకొనే విద్యార్థులకు ప్రాథమిక స్థాయిలో కనీస సామర్థ్యాలైన చదవటం, రాయటం చతుర్విద ప్రక్రియలు గణితం, ఇంగ్లీష్ తదితర అంశాలపై పట్టు సాధించే విధంగా ఉపాధ్యాయులు నిరంతరం కృషి చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. దీనితో విద్యార్థులకు పై చదువులలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తవన్నారు.వారిలో మరింత సామర్థ్యం పెరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ. రవికుమార్ రెడ్డి, డిఆర్‌పిలు రాజశేఖర్, తుక్కాని శ్రీనివాసరెడ్డి, శోభన్, మంజుశ్రీ, గీత తదితరులు పాల్గొన్నారు

ఎక్స్‌ప్లొరేషన్ కార్మికుల ప్రమోషన్ పాలసీని మెరుగుపరచాలి

ప్రజాపక్షం/కొత్తగూడెం : ఎక్స్‌ప్లొరేషన్ డిపార్ట్‌మెంట్‌లో పనిచేస్తున్న కార్మికుల ప్రమోషన్ పాలసీని మెరుగు పరచాలని సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ (ఏ ఐటియూసి) కార్పొరేట్ బ్రాంచ్ కార్యదర్శి ఎస్‌వి రమణమూర్తి అన్నారు.బదిలీ పై వచ్చిన ఎక్స్ప్లొరేషన్ జిఎం శివన్నారాయణ, పదోన్నతి పొందిన ఏజిఎం రాజ్‌కుమార్‌ను మార్యదపూర్వకంగా కలిసి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా రమణమూర్తి మాట్లాడుతూ కార్మికుల సమస్యలను వివరించారు. నూతన డ్రిల్ విధానాన్ని ప్రవేశ పెట్టి పాతపద్ధతికి స్వస్తి చెప్పాలన్నారు. ఎక్స్ప్లొరేషన్ వర్క్ షాపులో నూతన యంత్రాలను తీసుకురావాలని కోరారు. సానుకూలంగా స్పందించిన అధికారులు త్వరితగతిన సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేయనున్నట్లు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సహాయ కార్యదర్శి సామల రాము, ఉపాధ్యక్షులు క్రిస్టాఫర్, పిట్ కార్యదర్శి బండి సదానందం, పిట్ సహాయ కార్యదర్శి తుమ్మ రవికుమార్, నాయకులు దావా వెంకటేశ్వర్లు, కొండల్, జే రమేష్, పుల్లాచారి, నవ్య, అనూష, ఫిరోజ్‌ఖాన్ తాండ్ర రాజమల్లు, మాదాపూర్ తిరుమల రావు తదితరులు పాల్గొన్నారు.